PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 95 | విజయవాడ, ఆదివారం 6 నవంబర్ 2022 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 6 November 2022 | Rs

మహిళా రిజర్వేషన్లపై

కేంద్రానికి సుప్రీం నోటీసు

- ఆరు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం

లోపలి పేజీలో..



టైటిల్ విజేత ముంబయి

- ఫైనల్లో హిమాచల్‌ప్రదేశ్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపు
- సయ్యద్ ముస్తాక్ అలీ టి20

లోపలి పేజీలో..

ప్రకృతి ప్ర'కోపం'

- కలవరపెడుతున్న వాతావరణ విపత్తులు
- తొమ్మిది నెలల్లో దేశ వ్యాప్తంగా 2,755 మంది మృతి
- సిఎస్‌ఇ నివేదిక వెల్లడి
- నేటి నుండి కాప్ సదస్సు

న్యూఢిల్లీ : కార్పొరేట్ల కాసుల కక్కుర్తి సామాన్యులకు ప్రాణ సంకటంగా మారుతోంది. లాభాల కోసం కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యం వాతావరణాన్ని విషతుల్యంగా మారుస్తోంది. ఫలితంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా లక్షలాది మంది ప్రాణాలను తీస్తున్నాయి. మనదేశంలోనూ ప్రకృతి ప్రకోపానికి బలవుతున్న వారి సంఖ్య తక్కువేమికాదు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్‌ఇ), డౌన్ టు ఎర్త్‌లు ప్రచురించిన తాజా నివేదిక ప్రకారం వాతావరణ మార్పుల కారణంగా చోటుచేసుకున్న విపత్తులలో దేశ వ్యాప్తంగా జనవరి నుండి సెప్టెంబర్ వరకు (273 రోజుల్లో) 2,755 మంది మరణించారు. అధికారిక సమాచారం ప్రకారమే ఈ సంఖ్య ఇస్తున్నామని, వాస్తవానికి మృతుల సంఖ్య ఇంకా ఎక్కువ వుండే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. నేటి నుండి ఈజిప్టులో ఐక్యరాజ్యసమితి భాగస్వామ్య దేశాల సదస్సు (కాప్-27) ప్రారంభమవుతున్న నేపథ్యంలో . క్లైమేట్ ఇండియా-2022, ఏన్ అసెస్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌ట్రీమ్ వెదర్ ఈవెంట్స్ జనవరి-సెప్టెంబర్' పేరిట ఈ నివేదికను ప్రచురించారు.

ప్రతిరోజూ విపత్తే...!

ఈ నివేదిక ప్రకారం ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల కాలంలో దాదాపుగా ప్రతిరోజూ దేశంలో ఏదోఒక ప్రాంతంలో విపత్తు చోటుచేసుకుంది. జనవరి ఒకటి నుండి సెప్టెంబర్ 30 వ తేది వరకు 273 రోజుల్లో 241 వాతావరణ విపత్తులు (90శాతం) నమోదయ్యాయి. భారీ వర్షాలు, వరదలు, వడగాలులు, చలిగాలులు, పిడుగుపాట్లు, కొండచరియలు విరిగిపడటం వంటి సంఘటనల కారణంగా దేశ వ్యాప్తంగా 2,755 మంది మరణించారు. 1.8 మిలియన్ హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 4,16,667 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 70వేలకు పైగా పశుసంపద మృత్యువాత పడింది. అయితే, కేంద్ర ప్రభుత్వంతోపాటు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించిన సమాచారం నుండే ఈ వివరాలు సేకరించారు. అధికారికంగా నమోదుకాని నష్టాలు ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. అత్యధిక వాతావరణ విపత్తులు చోటుచేసుకున్న రాష్ట్రంగా మధ్య ప్రదేశ్ నిలిచింది. ఇక్కడ రోజు విడిచి రోజు ఒక విపత్తు చోటుచేసుకుంది. అయితే, మరణాల సంఖ్యలో హిమాచల్ ప్రదేశ్ మొదటిస్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 359 మరణాలు చోటుచేసుకున్నాయి. అస్సాం, మధ్యప్రదేశ్‌లలో 301 మంది మరణించారు. కర్ణాటకలో 82 రోజుల్లో విపత్తులు నమోదుకాగా ఆ రాష్ట్రంలో సాగయ్యే పంటలో 50శాతం దెబ్బతింది. అత్యధిక విపత్తు దినాలు నమోదైన మధ్యప్రదేశ్ పంట నష్టాలను అసలు రికార్డే చెయ్యలేదు. మరికొన్ని రాష్ట్రాలలో కూడా ఈ తరహాలోనే నమోదు ప్రక్రియ జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లో...

జనవరి ఒకటి నుండి సెప్టెంబర్ 30 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 45 వాతావరణ విపత్తు రోజులు నమోదయ్యాయి. 33 మంది మరణించారు. 25,212 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. 45 ఇళ్లు కూలాయి. 9 పశువులు మరణించాయి.

గతంతో పోలిస్తే తుపానుల కారణంగా రాష్ట్రంలో ప్రాణనష్టం గణనీయంగా తగ్గిందని, వాతావరణ హెచ్చరికలు సకాలంలో క్షేత్రస్థాయికి చేరడంతో పాటు ప్రభుత్వాలు తీసుకుంటున్న రక్షణ చర్యలు దీనికి కారణమని పేర్కొన్నారు. అదే సమయంలో వడగాలులు, పిడుగుపాట్ల కారణంగా మరణాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ పథకం మిగతా 2లో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పిల్లలకు రీయింబర్స్‌మెంట్ పరిమితి పెంపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ,వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు ట్యూషన్ ఫీజు కోసం రీయింబర్స్‌మెంట్ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం పెంపుదల చేసింది. ప్రస్తుతం సంవత్సరానికి రూ.వెయ్యి చొప్పున ఇస్తున్న ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.2500కు పెంచింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు 30న పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన జిఓఎంఎస్ నెంబరు 160 అమలులో వివక్ష ఉందని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జిఒను సవరించాలని కోరుతూ రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తేదీ 25.10.22న వినతిపత్రం సమర్పించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామ వార్డు సచివాలయాల శాఖ తరపున అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్‌శాఖ రీజినల్ డైరెక్టర్లు, పాఠశాల విద్యాశాఖ జిఒను అమలు చేయాలని పేర్కొన్నారు. కనిష్టంగా ఇద్దరు పిల్లలకు చెల్లించనున్నారు. ఎల్‌కెజి నుంచి ఇంటర్మీడియల్ చదివే పిల్లలకు బోధనా రుసుములు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం సూచించింది.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు

దిగుమతి సుంకం రద్దుతో ధరలు తిరోగమనం

కేంద్రం తీరుతో 4 నెలల్లో టన్నుకు రూ.10,000పైగా పడిపోయిన వైనం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

లాభాల పంటగా కీర్తి గడించిన ఆయిల్ పామ్ సాగు నష్టాల బాట పట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. దేశీయ మార్కెట్లో ధరలు పడిపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు చెబుతున్నారు. వంట నూనెలు ఉత్పత్తి చేసే సంస్థలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మేలో ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు గరిష్టంగా రూ.23,365 ధర ఉండగా, తాజాగా రూ.13,000కు పడిపోయింది. ఇదే ధర కొనసాగితే ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టపోతామని సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. 40,826 ఎకరాల్లో సాగవుతోంది. ఈ ఏడాది మరో ఐదు వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది 4,175 ఎకరాల్లో మొక్కలు నాటడం ప్రారంభమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ధరలు తిరోగమనంలో ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం టన్నుకు రూ.20 వేలు ఇప్పించాలని కోరుతున్నారు.

గతంలో లాభాల పంట

పండిన ఆయిల్‌పామ్ గెలలను గానుగ ఆడించి, ముడి చమురును పెద్దాపురం, నల్లజర్లలోని యర్నగూడెంలలో మిల్లులకు తరలిస్తుంటారు.



ఆయా మిల్లుల్లో ప్రతి నెలా సగటు ముడి చమురు నిష్పత్తి (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో-ఇఒఆర్) ఆధారంగా అధికారులు, వ్యాపారుల కమిటీ ఆయిల్‌పామ్ గెలలకు ధర ప్రకటిస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి మూడో వారంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఆయా దేశాల నుంచి క్రూడ్ పామాయిల్ (సిపిఒ) దిగుమతి నిలిచిపోయింది. దేశీయంగా వంట నూనెలను ఉత్పత్తి చేసే కంపెనీలకు ముడిసరుకు కొరత ఏర్పడింది. రైతుల నుంచి ఆయిల్‌పామ్ గెలలను ఆయా కంపెనీలు పోటీపడి కొనుగోలు చేశాయి.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో తిరోగమనం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని ఇటీవల ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఆయిల్ కంపెనీలు, ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు ధరలను భారీగా తగ్గించాయి. ఈ ఏడాది జనవరిలో రూ.17,000, ఫిబ్రవరిలో రూ.19,300 మార్చిలో రూ.21,940 ఏప్రిల్‌లో రూ.22,518, మేలో మిగతా 2లో

ఇళ్లు కూల్చడం దుర్మార్గం

రాజకీయ దురుద్దేశంతో ఇలాంటి చర్యలు తగవు : పి మధు

ఇప్పటంలో బాధితులను పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రభుత్వమే ఇళ్లునిర్మించి ఇవ్వాలి : పార్టీ రాష్ట్ర కమిటీ



ఇప్పటంలో పర్యటిస్తున్న పి మధు తదితరులు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా), అమరావతి బ్యూరో

రాజకీయ దురుద్దేశంతో రైతులు, పేదల ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గమని సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం గ్రామంలో అధికారులు శుక్రవారం కూల్చివేసిన ఇళ్లను సిపిఎం బృందం శనివారం పరిశీలించి బాధితులతో మాట్లాడింది. అనంతరం విలేకర్లతో మధు మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగడం తగదన్నారు. ఇళ్లు నష్టపోయిన బాధితులను వెంటనే ఆదుకోవాలని, తక్షణం నష్టపరిహారం చెల్లించాలని, ఇళ్లు కూల్చిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో పెద్ద రోడ్డు ఉందని, కనీసం బస్సు సౌకర్యం కూడాలేని ఈ గ్రామంలో రోడ్డును ఇంకా విస్తరించాలని చూడడం స్థానిక ఎమ్మెల్యే కక్షసాధింపు చర్యల్లో భాగమేనని విమర్శించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో పేదల నివసిస్తున్న స్థలాలకు ఇప్పటికీ పట్టాలు ఇవ్వలేదని, ఇళ్ల స్థలాలు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, మంగళగిరి మండల పరిషత్తు ఉపాధ్యక్షులు మొసలి ఫకీరయ్య, సిపిఎం మంగళగిరి మండల కార్యదర్శి ఎం జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి : సిపిఎం రాష్ట్ర కమిటీ

గుంటూరు జిల్లా తాడేపల్లి-మంగళగిరి నగర పాలక సంస్థ పరిధిలోని ఇప్పటం గ్రామంలో రోడ్డు వెడల్పు పేరిట ఇళ్లు కూల్చివేయడాన్ని మిగతా 2లో

ఎన్‌కౌంటర్ చేసినా భయపడను

- ఇప్పటం పర్యటనలో పవన్ కల్యాణ్
- బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం ప్రజాకంటక పాలన సాగిస్తోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. ఈ ప్రభుత్వంతో సమరానికి తాను సిద్ధమేనని ప్రకటించారు. తాడేపల్లి-మంగళగిరి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన రోడ్ల విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులను శనివారం ఆయన పరామర్శించి ఓదార్చారు. తొలగించిన ఇళ్లను పరిశీలించారు. ఇల్లు కోల్పోయిన వారు పవన్‌ను చూడగానే కన్నీటి పర్యంతమయ్యారు. తాము జనసేన బహిరంగ సభకు స్థలం ఇచ్చామన్న కారణంతోనే తమ ఇళ్లను కూల్చారని తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ బాధితులకు జనసేన అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ.. తనను ఎన్‌కౌంటర్ చేసినా భయపడనని, ప్రజల కోసం రాజీలేని పోరాటం చేస్తానని అన్నారు. కూల్చివేతల ప్రభుత్వాన్ని కూల్చివేయక తప్పదని తెలిపారు. రాష్ట్రంలో గుంతలు పూడ్చి రోడ్లు వేయలేరు... ఉన్న రోడ్డును విస్తరిస్తారా? అని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే కడప జిల్లా ఇడుపులపాయ మీదుగా జాతీయ రహదారి వేస్తామని అన్నారు. కాకినాడ లేదా రాజమహేంద్రవరంలో రోడ్లు వెడల్పు చేశారా? అని ప్రశ్నించారు.

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నివాసం ఉండే పెదకాకాని రోడ్డు 15 అడుగులే ఉన్నా పట్టించుకోలేదన్నారు. అరెస్టులకు భయపడేది లేదని, దేనికైనా సిద్ధమేనని అన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతోనే ఈ ఆరాచకం జరుగుతోందని విమర్శించారు. మంగళగిరి నుంచి ఇప్పటం వెళ్తున్న పవన్ కల్యాణ్‌ను పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీంతో, ఆయన రోడ్డు మార్గంలో



ఇప్పటం గ్రామస్తులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

నడుచుకుంటూ వెళ్లారు. కొద్దిసేపటికి పోలీసు అధికారులు వచ్చి వాహనం ఎక్కమని కోరినా ఆయన ముందుకు నడిచారు. పోలీసులను ఏమి అనవద్దని, చేతులు కట్టుకుని నడవాలని కార్యకర్తలకు సూచించారు.

జగన్ పాపం పండింది : చంద్రబాబు

శిశుపాలుడిలా జగన్ వంద తప్పులు దాటాయని, ఇక మిగిలింది ప్రభుత్వ పతనమే అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే హింస, దాడులు, కూల్చివేతలు, అడ్డగింతలు, అక్రమ అరెస్టులు అన్నట్లుగా మార్చేశారని విమర్శించారు. ఇప్పటం గ్రామం వెళ్తున్న జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌ను అడ్డుకుంటేనో, చీకట్లో తమ పర్యటనపై రాళ్లు వేస్తేనో పైచేయి సాధించలేరని దుయ్యబట్టారు. కూల్చడం మాని ఏదైనా కట్టి చూడాలని, ఆ తృప్తి ఏంటో అర్థమవుతుందని పేర్కొన్నారు. 600 ఇళ్లున్న ఇప్పటం గ్రామంలో 120 అడుగులకు రోడ్డు విస్తరిస్తారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

రాజధానిలో రహదారులు మరమ్మతులు చేయండి : లోకేష్

రాజధాని అమరావతిలో రహదారుల మరమ్మతులు చేపట్టాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రహదారులు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శికి శనివారం లేఖ రాశారు. రాష్ట్రంలో మూడున్నరేళ్లుగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని మిగతా 2లో

ఎస్‌బిఐకి భారీ లాభాలు

- క్యూ2లో రూ.13,265 కోట్లు

లోపలి పేజీలో..

భారత తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగీ మృతి



సిమ్లా : భారత తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగీ (106) శనివారం కన్నుమూశారు. హిమాచల్‌ప్రదేశ్‌కి చెందిన నేగీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నేగీ మృతికి కేంద్ర ఎన్నికల సంఘం విచారం వ్యక్తం చేసింది. నేగీ మృతి పట్ల హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేగీ అంత్యక్రియల్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహిస్తోంది. హిమాచల్‌లోని కిన్నౌర్‌లో 1917 జులై 1న జన్మించిన నేగీ ఉపాధ్యాయుడు. దేశంలో తొలి సార్వత్రిక ఎన్నికలు చాలా దశలు 1952 ఫిబ్రవరిలో జరిగాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితుల రీత్యా 1951 అక్టోబర్ 25న ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఓటు వేసిన తొలి వ్యక్తి నేగీ కావడం విశేషం. ఈ నెల 12న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నేగీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పరిమితులకు లోబడే ఇపిఎస్‌పై సుప్రీం తీర్పు!

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ కుమార్

లోపలి పేజీలో..

ఫీల్డ్ అసిస్టెంట్ల హక్కుల కోసం ఉద్యమిద్దాం

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- రెండవ రాష్ట్ర మహాసభ విజయవంతం

మేడ్చల్‌లో విషాదం

- నీటమునిగి ఆరుగురు దుర్మరణం
- మృతుల్లో ఐదుగురు చిన్నారులు, ఒక ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. చెరువులో ఈతకు వెళ్లి ఆరుగురు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఐదుగురు చిన్నారులు, ఓ ఉపాధ్యాయుడు ఉన్నారు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మల్కారం ఎర్రగుంట చెరువులో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్కారానికి చెందిన రెహ్మాన్ తన నూతన గృహప్రవేశం కోసం అంబర్‌పేటలోని హనీషా మదర్సా విద్యార్థులు, ఉపాధ్యాయులను పిలిచారు. శనివారం ఉపాధ్యాయులు సహా 40 మంది విద్యార్థులు మల్కారం వచ్చారు. అందరూ పిచ్చాపాటిగా మాట్లాడుకుంటూ కొద్దిసేపు సంతోషంగా గడిపారు. ఆ తర్వాత పక్కనే ఎర్రగుంట చెరువులో ఈతకు వెళ్లారు. ఈతకొట్టేందుకు ఐదుగురు విద్యార్థులు ఇస్మాయిల్ (11), జాఫర్ (10), సోహెల్ (9),



అయాన్ (9), రియాన్ (12) చెరువులోకి దిగారు. వారికి లోతు తెలియక లోపలికి వెళ్లడంతో నీటిలో మునిగిపోయారు. అది గమనించి ఉపాధ్యాయుడు యోహన్(25) వారిని కాపాడే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. దాంతో ఆరుగురూ చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. కుషాయిగూడ ఎసిపి సాధన రష్మి పెరుమల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, ఎస్‌ఐలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు మునుగోడు ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


తెలంగాణలోని మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ఆదివారం జరగనుంది. కౌంటింగ్‌కు నల్గొండలోని గిడ్డంగుల సంస్థ గోడౌన్‌లో ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఇందుకోసం 21 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 298 పోలింగ్ కేంద్రాల్లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో (ఇవిఎం) నిక్షిప్తమైన ఓట్లను 15 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకల్లా తొలి ఫలితం వెల్లడయ్యే అవకాశముంది. కౌంటింగ్ సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 3న జరిగిన మునుగోడు ఉప ఎన్నికలో రికార్డు స్థాయిలో 93.3 శాతం ఓటింగ్ నమోదైంది. గెలుపుపై టిఆర్‌ఎస్, కాంగ్రెస్, బిజెపి ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టిటిడి ఫిక్స్‌డ్ డిపాజిట్లు 15,900 కోట్లు

- శ్వేతపత్రం విడుదల చేసిన ఇఒ ఎవి ధర్మారెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

షెడ్యూల్డ్ బ్యాంకుల్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తోందని ఆ సంస్థ ఇఒ ఎవి ధర్మారెడ్డి తెలిపారు. మెచ్యూరిటీ పూర్తయిన ఐదు వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం బాండ్ల రూపంలో డిపాజిట్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, ఎలాంటి వదంతులూ నమ్మొద్దని అన్నారు. శనివారం ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో టిటిడి శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ రూ.15,900 కోట్ల టిటిడి ఫిక్స్‌డ్ డిపాజిట్లు వివిధ జాతీయ బ్యాంకుల్లో ఉన్నాయని తెలిపారు. టిటిడి నియమనిబంధనల ప్రకారం మిగులు మొత్తాలను ఏ బ్యాంకు ఎక్కువ వడ్డీ ఇవ్వడానికి ముందుకొస్తుందో అలాంటి షెడ్యూల్డ్ బ్యాంకుల్లో మాత్రమే పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. బ్యాంకుల్లో నగదు, బంగారం డిపాజిట్ చేయడానికి టిటిడి బోర్డు ఆమోదించిన పెట్టుబడి మార్గదర్శకాల ప్రకారం అర్హతగల షెడ్యూల్డ్ బ్యాంకులు, సంస్థల నుండి టిటిడి కొటేషన్లు ఆహ్వానిస్తుందని తెలిపారు. ప్రభుత్వంతో



ఆమోదించబడిన ప్రైవేట్ రంగ బ్యాంకులు కొటేషన్లు సమర్పించే అర్హత పొందడానికి అత్యధిక క్రెడిట్ రేటింగ్ కలిగి ఉండాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టకూడదని టిటిడి బోర్డు ఇప్పటికే తీర్మానించిందని చెప్పారు. ఈ దృష్ట్యా కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడులు పెట్టడం లేదని తెలిపారు. శ్రీవారి హుండీ ద్వారా వచ్చిన బంగారు కానుకలను 12 సంవత్సరాల దీర్ఘకాలిక బంగారు డిపాజిట్లలో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ కింద భారత ప్రభుత్వ మింట్‌కు పంపుతున్నాయని చెప్పారు. ఆనంద నిలయం అనంత స్వర్ణమయంపై ఈ నెల 30న నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత నెలలో 22.72 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని, హుండీ కానుకల ద్వారా రూ.122.23 కోట్లు ఆదాయం లభించిందని తెలిపారు. వచ్చే నెల నుంచి ప్రయోగాత్మకంగా విఐపి బ్రేక్ దర్శనం ఉదయం 8 గంటల నుండి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు విడుదల చేస్తామని చెప్పారు.

డిసెంబర్ 11న మిడ్డేమీల్స్ కార్మికుల డిమాండ్ డే

సిఐటియు జాతీయ కార్యదర్శి ఎ.ఆర్.సింధు



మహాసభలో మాట్లాడుతున్న సింధు, వరలక్ష్మి, రమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చే నెల 11న దేశవ్యాప్తంగా డిమాండ్ డే నిర్వహించనున్నట్టు సిఐటియు జాతీయ కార్యదర్శి ఎ.ఆర్.సింధు ప్రకటించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత మిడ్డే మీల్స్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రెండో మహాసభ సందర్భంగా శనివారం ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.వరలక్ష్మి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌వి రమతో కలిసి ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు అతి తక్కువ గౌరవ వేతనాలు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ అలవెన్స్ జైలులో శిక్ష అనుభవించే ఖైదీలకిచ్చే దానికంటే తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాన్ని సక్రమంగా అమలు చేయడానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించట్లేదని విమర్శించారు. దీనివల్ల పిల్లలు పౌష్టికాహారలేమితో బాధపడుతున్నారని తెలిపారు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ఇదే విషయాన్ని చెప్పిందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఆ పథకానికి నిధులు పెంచాలని పలు పార్లమెంటరీ కమిటీలు సిఫార్సు చేసినా పాలకులు పట్టించుకోవట్లేదన్నారు. కార్మికులకు చాలా రాష్ట్రాల్లో రూ.1000 వేతనం మాత్రమే ఇస్తున్నారనీ, అదీ 10 నెలలకు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలకు జీతాలు ఇవ్వాలని చత్తీస్‌గఢ్ హైకోర్టు ఆర్డర్ జారీ చేసినా అమలు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పథకాన్ని కార్పోరేట్లకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని విమర్శించారు. దానికనుగుణంగా ఇస్కాన్, అక్షయపాత్ర వంటి కార్పోరేట్లు కేంద్రీకృత వంటగదులను ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్న తీరును వివరించారు. గుడ్డు, ఉల్లిపాయలు ఆహారంలో చేర్చరాదంటూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఆహారం, ఆరోగ్యం, విద్య, మొదలైన ప్రాథమిక హక్కులు తీర్చే పథకాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాలను ఉధృతం చేయబోతున్నట్టు ప్రకటించారు. 2023 జనవరి 6ను స్కీం వర్కర్ల ఉమ్మడి అఖిల భారత నిరసన దినంగా పాటించాలని ఆమె పిలుపునిచ్చారు. అఖిల భారత మిడ్డే మీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.వరలక్ష్మీ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా అన్యాయంగా వ్యవహరిస్తున్నాయనీ, వారిని కనీసం కార్మికులుగా గుర్తించట్లేదని విమర్శించారు. పాఠశాలల్లో వండితేనే పిల్లలకు వేడివేడి భోజనం అందించవచ్చునని చెప్పారు. పేదలు, కార్మికుల నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని లాగేసుకుని కార్పోరేట్లకు కట్టబెట్టే కుట్రని తిప్పికొట్టేందుకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

అత్యంత ప్రమాదకరంగా మోడీ పాలన : ప్రశాంత్ భూషణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో అత్యంత ప్రమాదకరంగా ప్రధాని మోడీ పాలన సాగుతోందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని ప్రొఫెసర్ జి రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆడిటోరియంలో 'సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ ద ప్రోగ్రెస్ ఆఫ్ డెమోక్రసీ' అంశంపై శనివారం జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అత్యున్నత వ్యవస్థలైన ఇడి, సిబిఐ, ఇసి, జ్యూడిషియల్, మీడియా స్వయం ప్రతిపత్తిని కోల్పోతున్నాయని చెప్పారు. పాలకుల ఒంటెద్దు పోకడలతో స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందని అన్నారు. ఉద్యోగాలను సాధించడం నిరుద్యోగుల హక్కు అని, ఉద్యోగాలు ఇప్పించడం, ఉపాధి కల్పించడం ప్రభుత్వాల బాధ్యతని చెప్పారు. గౌతం అదాని వంటి కార్పొరేట్ అధిపతులనే మోడీ పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

ఇప్పటంలో కూల్చింది డ్రైనేజీపై ఆక్రమణలే

● జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇప్పటంలో ఒక్క ఇల్లూ కూల్చలేదని, కూల్చింది డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలేనని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. తాడేపల్లి వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుట్ర రాజకీయాల్లో భాగంగానే పార్టు -1 రెక్కీ, పార్టు- 2 రాయి, పార్టు -3 ఇప్పటంలో పవన్‌కల్యాణ్ పర్యటన సీరియల్‌గా మూడు రోజులుగా నడిపిస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న చిన్న చిన్న ఆక్రమణలను , ప్రహరీగోడలను తొలగించారని ఇవిగో సాక్ష్యాలంటూ ఫోటోలను మీడియాకు విడుదల చేశారు.

అక్రమ ప్రహరీలు కూలిస్తే ప్రభుత్వాన్ని కూల్చాలా : అంబటి

అక్రమ ప్రహరీలు కూలిస్తే ప్రభుత్వాన్ని కూల్చాలా అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. తాడేపల్లి వైసిపి కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటంలో రహదారి విస్తరణ కోసం ఎప్పుడో మార్కింగ్ ఇచ్చారని, నోటీసులూ ఇచ్చారన్నారు. తనపై రెక్కీ జరిగిందంటూ పవన్‌కల్యాణ్ డ్రామా, తనపై రాళ్లదాడి చేశారని చంద్రబాబు హంగామా అన్నీ బోగస్ అని అంబటి రాంబాబు పేర్కొన్నారు. పవన్‌కల్యాణ్ రాజకీయాలకు పనికి రాడని విమర్శించారు.

మండలి ఎన్నికల్లో వైసిపి అక్రమాలు

టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలి ఎన్నికల్లో సైతం వైసిపి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడాలని చూస్తోందని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆ పార్టీ నేత ఎఎస్ రామకృష్ణతో కలిసి అశోక్‌బాబు మాట్లాడారు. ఈ ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్ల వ్యవస్థను ఉపయోగించరాదని ఎన్నికల సంఘం ఆదేశించినా ..దానికి విరుద్ధంగా రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ బహిరంగ ప్రకటనలు చేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. చిత్తూరు ఓటర్ల నమోదుపై కూడా సిఎం కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేస్తూ అధికారులను ప్రలోభపెడుతున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపైనా, అనంతపురం, నెల్లూరు డిఇఒల బదిలీపైనా ఇసికి ఫిర్యాదు చేస్తామన్నారు.

బియ్యాన్ని దోచేస్తున్న జగన్ : ఆలపాటి

పేదల బియ్యాన్ని 'జగన్ గ్యాంగ్' దోచేస్తోందని మాజీ మంత్రి, టిడిపి నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. మూడున్నరేళ్ల పాలనలో రూ.7 వేల కోట్లు తినేశారని తెలిపారు. నవరత్నాల పేరుతో పేదవాడి నవనాడుల్నీ పిండేస్తూ జేబులు నింపుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు.

పవన్ కళ్యాణ్ హత్యకు రూ.250 కోట్ల సుపారి

టిడిపి నేత బొండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ హత్యకు రూ.250 కోట్లకు సుపారీ మాట్లాడారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పథకం ప్రకారం ప్రభుత్వం ప్రతిపక్ష నేతల ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడటం లేదని పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనమే పవన్‌పై రెక్కీ అని తెలిపారు. నందిగామ పర్యటనలో చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి ఎమ్మెల్సీ అరుణ్, అతని ముఖ్య అనుచరులు కుట్రపన్ని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. చంద్రబాబుపై హత్యాయత్నంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని ముద్దాయిలుగా చేర్చి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పవన్ హత్య సుపారీపై కూడా విచారణ జరగాలని, ఇందులో 'తాడేపల్లి హస్తం' ఉందనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. జగన్ పర్యటనకు ముందస్తు అరెస్టులు చేసి పరదాలు కట్టే పోలీసులు చంద్రబాబు పర్యటనలో ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. అభద్రతా భావం వైసిపి నాయకుల్లో వచ్చింది కాబట్టే రాళ్ల దాడి జరిగిందని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.



రూ.2 వేల కోట్లు దాటిన ఓవర్‌డ్రాఫ్ట్

● వరుసగా మూడో రోజు ఓడీలోనే..

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానాకు ఓవర్‌డ్రాఫ్ట్ బాధలు వీడడం లేదు. ప్రస్తుతం రూ.2,027 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉన్నట్లు తేలింది. ఈ నెలలో ఇది మూడో రోజు కావడం గమనార్హం. తొలి రోజు రూ.1,848 కోట్లు, రెండో రోజు రూ.1,982 కోట్లుగా ఉన్న ఓవర్‌డ్రాఫ్ట్ మూడో రోజుకు రూ.2 వేల కోట్లు దాటిపోవడం గమనార్హం. బహిరంగ మార్కెట్ వేలం నుంచి రుణం తీసుకున్నప్పటికీ, జీతాలు, పింఛన్లకు చాలకపోవడంతో ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంత చేసినప్పటికీ ఇంకా అనేక మందికి జీతాలు రాకపోవడం, వచ్చే మంగళవారం మరికొంత బహిరంగ మార్కెట్ ద్వారా రుణాలు చెస్తే తప్ప జీతభత్యాల సమస్య గట్టెక్కడం కష్టమని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టంపై పుస్తకం విడుదల



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం-1989 సమగ్ర పరిశీలన" పుస్తకాన్ని కేరళ ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖ మంత్రి కె.రాధాకృష్ణన్, కేరళ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ చిట్టయం గోపకుమార్ విడుదల చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ కుమార్ రాసిన పుస్తకాన్ని కెవిపిఎస్ ఏపి రాష్ట్ర కమిటీ, డిఎస్ఎంఎం ప్రచురించాయి. శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుభాషిణీ అలీ, రామచంద్రన్ డోమ్, బి. వెంకట్, ఆంద్ర మాల్యాద్రి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమిద్దాం

- ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు
- అధ్యక్షులుగా పరంధామయ్య, ప్రధాన కార్యదర్శిగా నరసింహులు
- రెండవ రాష్ట్ర మహాసభ విజయవంతం



మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - నెల్లూరు

హక్కుల కోసం ఉద్యమించాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర రెండవ మహాసభ నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించారు. మహాసభ ప్రారంభోత్సవానికి ముందు నగరంలోని ముత్తుకూరు గేట్ సెంటర్ నుంచి డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిఐటియు జెండాను ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ఎపికి మొట్టమొదటి స్థానం రావడంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఇటువంటి ఫీల్డ్ అసిస్టెంట్లను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ..కరోనాతో ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.కరోనాను ఆసరాగా చేసుకుని ప్రజలను కార్పొరేట్ శక్తులు దోచుకున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దాసోహమయ్యాయన్నారు. అధికారం కోసం జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చారని..అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ గౌరవాధ్యక్షులు టివివి ప్రసాద్ మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.20 వేలు చెల్లిస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మాండేసి విధానం రద్దు చేయాలని, మండల స్థాయిలో బదిలీలు చేపట్టాలని, రాజకీయ వేధింపులను అరికట్టాలని చేసిన పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. మహాసభకు హరినాథ్, నరసింహులు, ఇరగాలయ్య అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.



నరసింహులు



పరంధామయ్య

రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

31 మందితో నూతన కమిటీ ఏర్పడింది. రాష్ట్ర అధ్యక్షులుగా పరంధామయ్య, ప్రధాన కార్యదర్శిగా డి.నరసింహులు ఎన్నికయ్యారు. 14 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది. ఉపాధ్యక్షులుగా హరినాథ్, మహేష్, రామకృష్ణ, విశ్వనాథ్ , భవాని, రాజశేఖర్, కార్య దర్శులుగా హరిప్రసాద్, శ్యామ్ స్వరూప్, సుందరయ్య,శివ, సూర్యనారాయణ, ఆంజనేయులు, కోశాధికారిగా ఖాదర్ బాషా ఎన్నికయ్యారు.

ఇళ్లు కూల్చడం దుర్మార్గం

మొదటిపేజి తరువాయి

సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. కూల్చిన ఇళ్లను తిరిగి పునర్నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామానికి వచ్చే రహదారులు వెడల్పు చేయకుండా ఆర్‌టిసి బస్సు కూడా వెళ్లని చిన్న గ్రామంలో రోడ్డును 120 అడుగులు వెడల్పు చేయడానికని ఇళ్లు కూల్చివేయడం రాజకీయకక్షతో చేశారన్న అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఇదే రోడ్డుకు ఇరుపక్కలా మురుగు కాలువలు నిర్మించినప్పుడు ఈ అంశాన్ని ప్రస్తావించకుండా, హఠాత్తుగా ఆక్రమణల పేరుతో కూల్చడం అన్యాయమని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలందరి సంక్షేమానికి పాటుపడుతున్నట్లు చెబుతున్న వైసిపి ప్రభుత్వం ఇటువంటి కక్షపూరిత ధోరణితో వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కూల్చివేసిన ఇళ్ల స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి ప్ర'కోపం'

మొదటిపేజి తరువాయి

కింద పనులు చేస్తున్న కూలీలు, వ్యవసాయ కార్మికులు అసంఘటిత రంగానికి చెందిన ఇతరులు వడగాల్పుల మృతుల జాబితాలో ఉంటున్నారు. అయితే, ఈ నష్టాన్ని మరింతగా అధ్యయనం చేయాల్సిఉందని నివేదికలో పేర్కొన్నారు. తెలంగాణలో 41 వాతావరణ విపత్తు రోజులు నమోదుకాగా, 27 మంది మరణించారు. 14,858 ఇళ్లు నేలకూలాయి. 1,574 పశువులు మరణించాయి. గంటకు 100 మి.మీ వర్షపాతం నమోదయ్యే క్లౌడ్‌బర్స్ట్ తెలంగాణలో ఒకటి చోటుచేసుకుంది. ఈ తరహా తీవ్ర కుంభవృష్టిలు హిమాచల్ ప్రదేశ్‌లో 7, ఉత్తరాఖండ్‌లో రెండు. జమ్మూకాశ్మీర్‌లో ఒకటి నమోదయ్యాయి.

కాప్‌లో ఏం చర్చించనున్నారు?

ఈజిప్టులో జరగనున్న కాప్ 27లో 200కుపైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆదివారం సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారు. సోమవారం నుండి పూర్తిస్థాయిలో చర్చలు జరుగుతాయి. వాతావరణ మార్పుల కారణంగా చోటుచేసుకుంటున్న దుష్పరిణామాలపై చర్చించనున్నారు. వాతావరణ కాలుష్యానికి సంబంధించి పారిశ్రామిక దేశాల చారిత్రాత్మక బాధ్యత, వాతావరణ న్యాయం (క్లైమేట్ జస్టిస్), నష్టం-నష్టపరిహారం(రిపరేషన్స్ ఫర్ లాస్ అండ్ డామేజి) తదితర అంశాలపై ప్రధానంగా చర్చలు సాగనున్నాయి. వాతావరణ సదస్సు ఈ సారి మాటలకే పరిమితం కాదని, చేతల్లోనూ ఫలితలు చూపుతామని నిర్వాహకులు ప్రకటించారు.

ఆయిల్‌పామ్ రైతు కుదేలు

మొదటిపేజి తరువాయి

రూ.23,365 చొప్పున ధరలు చెల్లించాయి. ఆయిల్‌పామ్ సాగు దిశగా రైతులు ఆసక్తి చూపించారు. జూన్‌లో టన్నుకు రూ.20,451 చెల్లింపులతో మొదలై ప్రతి నెలా ధరలు తగ్గించుకుంటూ వస్తున్నాయి. జులైలో రూ.16,921, ఆగస్టులో రూ.16,269, సెప్టెంబరు, అక్టోబరులలో రూ.13,058కు ఆయిల్‌పామ్ ధరలు పతనమయ్యాయి. నాలుగు నెలల్లోనే టన్నుకు రూ.10,307కు ధర పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తమవుతోంది.

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం ఉంటుంది

ఆయిల్‌పామ్ కొనుగోలుకు సంబంధించిన ధరలను ఉన్నతాధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధుల సమక్షంలో నిర్ణయాలు జరుగుతుంటాయి. కంపెనీలు రైతులకు మొక్కలను అందజేసి ఫలసాయం అందజేసిన తర్వాత కమిటీ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ఎగుమతులు, దిగుమతుల ప్రభావం ఉంటుంది.

- వి.రాధాకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా ఉద్యాన శాఖ అధికారి

ఎన్‌కౌంటర్ చేసినా భయపడను

మొదటిపేజి తరువాయి

తెలిపారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే మరమ్మతులు చేయాలని కోరారు.

రాజకీయ కక్షతో
కూల్చివేతలు నిలిపేయాలి : సిపిఐ

రాజకీయ కక్షతో చేపడుతున్న కూల్చివేతలను నిలిపేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ పోలీసుల దాష్టీకం పెరుగుతోందని, ప్రభుత్వ సూచనలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బస్సు కూడా వెళ్లని గ్రామాంలో అంత పెద్ద రోడ్లు ఎందుకు వేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

పరిమితులకు లోబడే ఇపిఎస్‌పై సుప్రీం తీర్పు!

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ కుమార్



ప్రజాశక్తి-అమరావతి

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఇపిఎస్)పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొన్ని పరిమితులకు లోబడి ఉందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ కుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని ప్రధాన అంశాలు, ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలు, నష్టాలు తదితర అంశాలపై ఆయనను ప్రజాశక్తి సంప్రదించగా, పలు కీలక అంశాలను వివరించారు. ఆ అంశాలిలా ఉన్నాయి.

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఇపిఎస్) సభ్యులకు ఈ నెల 4న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొన్ని పరిమితులకు లోబడి ఉంది. తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు దీనికి తార్కాణంగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వాన్ని పెన్షన్ స్కీమ్‌కు కంట్రిబ్యూట్ చేయాలని సిఫార్సులు చేయలేమని చెప్పింది. దానికి తగ్గ చట్టం లేకుండా తాము చేయగలిగిందేమీ లేదన్నది. 2014లో మోడీ ప్రభుత్వం పెన్షన్‌కు అర్హమైన వేతన లెక్కింపుకు అంతకు ముందున్న 12 నెలల వేతన సరాసరిని 60 నెలలకు పెంచుతూ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిలో ఎటు వంటి చట్ట వ్యతిరేక చర్య లేదని చెప్పింది. పెన్షన్ నిధుల లభ్యతను బట్టి పెన్షన్ ఉంటుందనే ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వాదనను అంగీకరించింది. పెన్షన్ నిర్ణయానికి ఉన్న ఫార్ములాను సమర్థించింది. ఈ ఫార్ములా వల్లే ఇపిఎస్ పెన్షన్ అతి తక్కువ స్థాయిలో వస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆఖరి వేతనంలో 50 శాతం బేసిక్ పెన్షన్‌గా ఇపిఎస్ పెన్షనర్లకు రాదు. వీరికి డిఎ కూడా లేదు.

వీరికి వచ్చే పెన్షన్‌ను కనీసంగా రూ.1000/- కు పెంచామని కేంద్ర ప్రభుత్వాలు చెప్పుకున్నప్పటికీ ఆ వెయ్యి కూడా చాలామందికి రావడం లేదు. కనీస పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాలని పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసినప్పటికీ మోడీ ప్రభుత్వం దాన్ని ఇంతవరకు అంగీకరించలేదు. ఇపిఎస్ పెన్షనర్లు కోరుతున్న కనీస పెన్షన్ రూ.9 వేలు అందని ద్రాక్షగా మారింది.

ఇపిఎస్ పెన్షనర్లకు పెన్షన్ ఫార్ములా - పెన్షన్ అర్హత వేతనం × సర్వీసు చేసిన సంవత్సరాలు ÷ 70 = నెలవారీ పెన్షన్. 2014 కు ముందు పిఎఫ్ / పెన్షన్‌కు వేతన పరిమితి రూ.6,500/- (బేసిక్ మరియు డీఏ). దీని ప్రకారం ఉద్యోగికి ఎంత వేతనం వచ్చినా సరే రూ.6,500/- మీద లెక్క వేస్తే వచ్చే పెన్షన్ ఎంత ఉంటుందన్నప్పుడు ఆ ఉద్యోగి 30 సంవత్సరాలు సర్వీసు చేసి ఉంటాడు అనుకుంటే 6,500 × 30 ÷ 70 = 2,785. ఈ పరిమితిని 2014 సెప్టెంబర్ 1 నుంచి రూ. 15 వేలకు పెంచారు. 2014 తర్వాత సర్వీసులో చేరి ఉంటే 30 సంవత్సరాల పాటు వేతనం కనీసం రూ. 15 వేలు వచ్చి ఉంటే వచ్చే పెన్షన్ 15,000 × 30 ÷ 70 = 6,428/-. వీటిపై డిఎ రాదు. ఎన్నాళ్ళు ఉన్నా పెన్షన్ అలాగే ఉంటుంది. ప్రభుత్వం విధించిన పరిమితికి మించి వేతనాలపై అదనపు చెల్లింపులు చేయడానికి సిద్ధపడే యజమానులు చాలా తక్కువ మంది ఉంటారు.

ఈ తీర్పు ప్రధానంగా పెన్షన్ పెంపునకు సంబంధించినది కాదు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాలి.

తీర్పులోని ముఖ్యాంశాలు

- ❒ 2014 ఆగస్టులో మోడీ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ సరైనదే. దానిలో కొన్ని మార్పులు చేయాలి. ఈ మార్పులు ప్రస్తుతం ఉన్న సభ్యులకు మాత్రమే వర్తిస్తాయి.
- ❒ నోటిఫికేషన్‌లోని పిఎఫ్ పరిమితి రూ.15 వేలకు మించి అధిక స్థాయి చెల్లింపులు చేయడానికి ఉద్యోగులకు, యజమానులకు ఇచ్చిన ఆప్షన్ గడువును ఈ నెల 4 నుంచి మరో నాలుగు నెలలకు పొడిగించింది.
- ❒ 2014 సెప్టెంబర్ 1 కి ముందు పదవీ విరమణ చేసిన వారు రూ.6,500/- పరిమితికి మించి పిఎఫ్ / పెన్షన్‌కు ఉద్యోగులు, యజమానులు చెల్లింపు చేసి ఉంటే వారు ఆ చెల్లింపుల ప్రకారం అధిక పెన్షన్‌కు అర్హులు.
- ❒ మినహాయింపు పొందిన సంస్థలు, మినహాయింపు పొందని సంస్థలకు మధ్య ఎటువంటి వ్యత్యాసం ఉండదు.
- ❒ 2014 నోటిఫికేషన్ ప్రకారం రూ.15 వేలకు మించి ఉభయులు చెల్లింపులు చేస్తే, ఇంతకు ముందులాగా అధిక చెల్లింపులు చేసిన వారికి వర్తించే 1.16 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లించదు. దానిని ఉద్యోగులే భరించాలి. కానీ ఈ ప్రొవిజన్‌ను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. రాజ్యాంగంలోని 142 ఆర్టికల్ ప్రకారం తనకు ఉన్న అధికారాన్ని ఉపయోగించుకుని ఈ ప్రొవిజన్‌ను కొట్టేసింది. ఈ 1.16 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం కట్టే విధంగా (సుప్రీంకోర్టు సూచన) ఆరు నెలల పాటు లేదా చట్టంలో మార్పులు చేసే వరకు ఉద్యోగుల నుంచి వసూలు చేయడాన్ని నిలిపేసింది.

ఇతర అంశాలు

- ➢ 2014కు ముందు రిటైర్ అయిన వారు సర్వీసులో ఉండగా రూ. 6,500/- మించి చెల్లింపులు చేసి ఉండకపోతే వారు అధిక పెన్షన్‌కు అర్హులు కారు. ఇది 2016లో ఆర్.సి.గుప్త కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కూడా ఉంది.
- ➢ పెన్షన్ సంస్కరణల అమల్లో భాగంగానే 1995లో ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ వచ్చింది. కార్మిక సంఘాలు కోరినట్లుగా పెన్షన్‌ను మూడో బెనిఫిట్ (మేనేజ్‌మెంట్ పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్)గా ఇవ్వకుండా మేనేజ్‌మెంట్ కంట్రిబ్యూషన్ తీసుకుని కొద్దిపాటి పెన్షన్ వచ్చే స్కీమే ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఇపిఎస్)ను అప్పటి పి.వి.నర్సింహారావు నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పెన్షన్ ఫండ్‌ను బట్టి పెన్షన్ వస్తుంది తప్ప దీనిలో ప్రభుత్వానికి, యజమానులకు బాధ్యత లేదు.
- ➢ 2004 జనవరి 1 నుంచి సర్వీసులో చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ లేదు. 2004 సెప్టెంబర్ 1 మరియు ఆ తర్వాత చేరిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ లేదు. 2010 ఏప్రిల్ 1 ఆ తర్వాత చేరిన బ్యాంకు, ఇన్సూరెన్స్ ఉద్యోగులకు పెన్షన్ లేదు. వీరందరూ సిపిఎస్‌లో ఉన్నారు. సిపిఎస్ అంటే పెన్షన్ లేనట్లే.
- ➢ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బోర్డును కార్పొరేషన్లుగా విడగొట్టిన తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులకు, టెలికాం డిపార్ట్‌మెంట్ బి.ఎస్.ఎన్.ఎల్ గా మారిన తర్వాత చేరిన బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేదు. వీరికి ఇపిఎస్ పెన్షన్ మాత్రమే వస్తుంది.
- ➢ ఇటువంటి పరిస్థితుల్లో సర్వీసులో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల మధ్య గరిష్ట ఐక్యత సాధించాల్సి ఉంది.

‘ఉక్కు’ ప్రయివేటీకరణ నిలిపేస్తూ ప్రధాని ప్రకటించాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రధాని మోడీ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపేస్తున్న ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు, విశాఖ ప్రముఖులు, పలువురు వక్తలు ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చైర్మన్ ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'ఉక్కు'పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ వి.వి.రమణమూర్తి, ఉత్తరాంధ్ర రక్షణ వేదిక అధ్యక్షులు ఎస్‌ఎస్.శివశంకర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, ఎం.రాజశేఖర్, జె.అయోధ్యరాం మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిందని, 16500 మంది రైతులు, నిర్వాసితులు 22 వేల ఎకరాల భూములను త్యాగం చేశారని గుర్తు చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు పెట్టిన రూ.5 వేల కోట్ల పెట్టుబడి ప్రజలదని, ఈ నేపథ్యంలో ప్లాంటును అమ్మే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. దేశం ఆర్థికంగా నిలదొక్కుకొని, బలోపేతం కావడానికి ప్రభుత్వ రంగ సంస్థలే కీలకమన్నారు. నాడు కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.4800 కోట్లు పెట్టుబడి పెట్టగా, అనంతర కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెండ్ల రూపంలో సుమారు రూ.50 వేల కోట్ల ఆదాయం ప్లాంట్ నుంచి సమకూరిందని తెలిపారు. నేడు రూ.3 లక్షల కోట్లు విలువ కలిగి స్టీల్ రంగంలో రారాజుగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో ఉంచి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. ప్లాంటును అమ్మే నిర్ణయానికి వ్యతిరేకంగా 630 రోజులుగా ఆందోళన జరుగుతోందని, … రాష్ట్ర ప్రభుత్వం, ఉత్తరాంధ్రలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంటును పరిరక్షించుకునేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐఎఫ్‌టియు, ఐఎఫ్‌టియు, వైఎస్‌ఆర్‌టియు, టిఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, ఐద్వా, … తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ ఇదీ..

రౌండ్ టేబుల్ సమావేశం పలు డిమాండ్లను, కార్యాచరణను ఏకగ్రీవంగా ఆమోదించింది. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రక్రియను వెంటనే విరమిస్తూ ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేసింది. ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడిచేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఇప్పటికే మిగిలి ఉన్న 8500 మంది ఉక్కు నిర్వాసితులకు పర్మినెంటు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. పై డిమాండ్లపై ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లోనూ కార్మికులు డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని కోరింది. ఈ నెల 9న కూర్మన్నపాలెంలోని ఉక్కు దీక్షా శిబిరం నుండి ప్రారంభమయ్యే ప్రదర్శన … రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, పక్కన కెఎస్.చలం తదితరులు

సిమెంట్ ధరలు పెరగొచ్చు

న్యూఢిల్లీ : సిమెంట్ కంపెనీలు ధరలు పెంచే అవకాశాలున్నాయని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనా వేసింది. నవంబర్‌లో ప్రతీ సిమెంట్ బ్యాగ్‌పై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచొచ్చని పేర్కొంది. గత నెలలో రూ.3-4 వరకు పెంచినట్లు తెలిపింది. వచ్చే కొన్ని రోజుల్లోనే సిమెంట్ కంపెనీలు ధరలను పెంచనున్నాయని పేర్కొంది.

పండగ సీజన్ అక్టోబర్‌లో సిమెంట్ డిమాండ్‌లో తగ్గుదల చోటు చేసుకుందని.. వచ్చే వారాల్లో తిరిగి గిరాకీ పెరగనుందని అంచనా వేసింది.

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి ఇద్దరు మృతి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్, పొదిలి

విద్యుదాఘాతానికి వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మరణించారు. ఈ ఘటనలు బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో శనివారం చోటు చేసుకున్నాయి. స్థానికుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పొదిలి మండలంలోని పోతవరం గ్రామంలో పులుసు వెంకటేశ్వరరెడ్డి(40) విద్యుత్ స్తంభం వద్ద కేబుల్ (డిష్ తీగలు) సరిచేస్తున్న క్రమంలో అవి ప్రధాన విద్యుత్ లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే గ్రామస్తులు ఆయనను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. … పోలీసులు కేసు నమోదు చేశారు. బాపట్ల జిల్లా బాపట్ల మండలం జగన్న కాలనీలోని … చింత విజయమ్మ గడ్డి కోస్తుంది. ఆ గడ్డిలో ఉన్న విద్యుత్ తీగలు గమనించకపోవడంతో అవి ఆమెకు తగిలి అక్కడికక్కడే మరణించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కారంచేడు (బాపట్ల జిల్లా)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. స్వర్ణ గ్రామంలోని యాదవ బజారుకు చెందిన వాసిలి శ్రీనివాసరావు అలియాస్ రోశయ్య (32) 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వివిధ పంటలను సాగు చేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో గత మూడు సంవత్సరాలుగా పంటలు దెబ్బతిన్నాయి. పంట సాగు కోసం సుమారు రూ.25లక్షలు అప్పు చేశారు. పంట దెబ్బతినడంతో, అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి చీరాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శనివారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, వి.కృష్ణయ్య తదితరులు

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి

● పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో 19, 20 తేదీల్లో నిర్వహించనున్న అలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, సమావేశాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, జిల్లా నాయకులతో కలిసి శనివారం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సమావేశాల ప్రారంభం సందర్భంగా మొదటి రోజు రాష్ట్ర సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశాలకు ఎఐకెఎస్ అగ్ర నాయకులు హన్నన్ మొల్లా, అశోక్ థావలే, విజుకృష్ణన్‌తోపాటు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నాయకులు హాజరవుతారన్నారు. రైతులు సెమినార్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వి.కృష్ణయ్య మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగానికి ఉరితాడు బిగించే విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపు, ఎరువుల సబ్సిడీ కుదింపు వంటి విధానాలు రైతులకు తీవ్ర నష్టం కలిగించాయన్నారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా 2024 మార్చిలో పది లక్షల మందితో చలో ఢిల్లీ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలు, భవిష్యత్తు కార్యాచరణపై జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కాజా వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొన్నారు.

సంపాదకీయం

సింధూరం

'చరిత్రలో ఎన్నో కథలు కాగితాల మీద కనపడవు. ఎందుకంటే, అవి స్త్రీల శరీరాల మీద, మనసు మీద రాయబడతాయి' అంటారు పంజాబ్ తొలి మహిళా రచయిత్రి అమృతా ప్రీతం. ఆడపిల్లగా పుట్టినందుకు వివిధ దశలన్నీ కలిపి 100 మార్కులు వేసే పురుషాధిక్య సమాజం మనది. తరతరాలుగా స్త్రీల శరీరాలు, మనసులు ఇలా వుండాలి... అలా వుండాలి అంటూ తెరలు కట్టి, హద్దులు గీసి...వారి స్వేచ్ఛకు, హక్కులకు కట్టుబాట్లనే శృంఖలాలు వేసింది. మరోవైపు స్త్రీలను మార్కెట్‌లో వస్తువును చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వాణిజ్య ప్రకటనల్లో మహిళ శరీరాన్ని కార్పొరేట్లు వస్తువుగా మార్చారు. అదే సమయంలో స్త్రీ వ్యక్తిత్వాన్ని, సృజనాత్మకతను గుర్తించే మానవీయతకు పురుషాధిక్యత అడ్డుపడుతూనే వుంటుంది. 'స్త్రీ శక్తిని, సృజనాత్మకతను ఒప్పుకోని పురుషుడు, తన అంతరాత్మని మోసం చేసుకోవడం తప్ప ఇంకేమీ కాదు. భారతీయ పురుషుడు ఇప్పటికీ సాంప్రదాయక స్త్రీలను చూడ్డానికి మాత్రమే అలవాటు పడి ఉన్నాడు. గొప్ప వ్యక్తిత్వమున్న స్రీలను గౌరవించడం అనే సౌజన్యం ఈ పురుషులకు రాదు' అంటారు అమృతా ప్రీతం.

'ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది' అంటాడు గురజాడ. ఆకాశమే హద్దుగా ఎదుగుతున్న మహిళకు మనువాద భావజాలం, కట్టుబాట్ల సంకెళ్లు అడుగడుగునా అడ్డుపడుతూనే వున్నాయి. తను ధరించే దుస్తుల నుంచి నుదుటి బొట్టు వరకూ అన్నిటినీ కొన్ని శక్తులు శాసిస్తున్నాయి. విజ్ఞాన నిలయాలైన విశ్వవిద్యాలయాల్లో సైతం మహిళా టీచర్లు, విద్యార్థినులు జీన్స్ ధరించకూడదంటూ ఆంక్షలు. మరో కాలేజీలో హిజాబ్‌లు ధరించరాదంటూ హుకుం. అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తున్న వారికి సైతం వాళ్ల డ్రెస్ కోడ్‌పై కించపరిచే వ్యాఖ్యలు తప్పడంలేదు. ఇటీవలి కాలంలో కట్టుబాట్ల చట్రంలో బంధించే ప్రయత్నం మరింత పెరిగింది. చివరకు ఒక మహిళ గర్భం ధరించే హక్కు కూడా తన చేతిలో లేకుండా పోయింది. తనకు ఇష్టం లేకుండా తల్లి కమ్మని నిర్బంధించే హక్కు, అధికారం ఎవరికీ లేవు. అది ఆ మహిళ నిర్ణయించుకోవాల్సిన విషయం. పూర్తిగా ఆమె హక్కు. అంతేకాదు మహిళల నుదురు చూసి అవమానించడం పరిపాటిగా మారింది. చదువుకుని, ఆధునిక ప్రపంచంలో తిరుగుతూ, ఉద్యోగాల్లో రాణిస్తున్న మహిళలకు సైతం ఇలాంటి చేదు అనుభవాలు, పరాభవాలు తప్పడంలేదు. తాజాగా... మహారాష్ట్ర బిజెపి నేత శంభాజీ భిడే ఓ జర్నలిస్టు నుదుట బొట్టు లేదని ఆమెతో మాట్లాడానికి నిరాకరించాడు. 'నన్ను ప్రశ్నించే ముందు బొట్టు ధరించాలని తెలియదా..? నీతో మాట్లాడను. భారత స్త్రీలు బొట్టు లేకుండా విధవ రూపంలో కనిపించకూడద'ంటూ వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. మహిళలు ఏ స్థాయిలోనున్నవారైనా, వారి ఆహార్యం పట్ల కించపరిచే వ్యాఖ్యలు చేయడం సంఘ పరివారానికి నిత్యకృత్యమైంది.

ఒకప్పుడు సతీసహగమనం అమలులో వుండేది. ఆ తర్వాత భర్త చనిపోతే ఆ మహిళ పూలు, బొట్టు, తాళి వంటివి తీసేయాలి. తెల్లచీర కట్టి, తలవెంట్రుకలు తొలగించి మూలన కూర్చోబెట్టేవారు. కానీ, భర్తతో వచ్చింది తాళి ఒక్కటే. చిన్ననాటి నుంచి అలంకరించునే పూలు, గాజులు, బొట్టు కాదు. వాటిని పెట్టుకోవాలా లేదా అనేది పూర్తిగా ఆమె ఇష్టం. 'ఆత్మ గౌరవాన్ని పోగొట్టుకోడం కంటే ప్రాణం పోవడం పెద్ద విషయం కాదు' అంటారు ఆఫ్రికన్ రచయిత్రి టోనీ మారిసన్. తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే హక్కు మహిళకు వుంది. 'ఒక స్త్రీగా నాకు ఒక దేశం లేదు/ ఒక స్త్రీగా.. నేను ఉండే స్థలమే దేశం... ప్రపంచం' అని ఆత్మ గౌరవంతో తన ఉనికిని, అస్తిత్వాన్ని ప్రకటిస్తుంది ఆంగ్ల రచయిత్రి వర్జీనియా వూల్ఫ్. స్త్రీలు ఇలాగే వుండాలని చెప్పే పురుషాధిక్య కట్టుబాట్ల సంకెళ్లను తెంచుకొని తన ఆత్మ గౌరవాన్ని నిలుపుకోవాలి. తమ ఇష్టాలకు బిగించిన కంచెలను, కంచుకోటలను తుత్తునియలు చేయాలి. ఆ దిశగా మహిళ అడుగులేయాలి. సమాజంలోని అభ్యుదయ శక్తులు అటువంటి వాటిలో భుజం భుజం కలపాలి. స్త్రీ, పురుష సమానత్వం అన్నింటా వెలుగొందాలి. అప్పుడే సమాజం పురోగమిస్తుంది.

మహనీయుల మాట



ఏదీ దానంతట అది
మన దగ్గరకు రాదు.
శోధించి సాధించాల్సిందే.

- శ్రీశ్రీ

అక్టోబర్ విప్లవం : భారత కార్మికవర్గం ముందున్న కర్తవ్యం

సందర్భం

నూట ఐదు సంవత్సరాల క్రితం జరిగిన గొప్ప అక్టోబర్ సోషలిస్టు విప్లవం, ఒక శతాబ్దం క్రితం ఏర్పడిన సోవియట్ యూనియన్ ప్రపంచ చరిత్ర గతినే మార్చివేశాయి.

నవంబర్ 7న ప్రారంభమైన అక్టోబర్ విప్లవం నూతన సమాజానికి నాంది పలికింది. ఒకరిని మరొకరు దోపిడీ చేయడం నుండి విముక్తి కలిగించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రామిక పీడిత ప్రజలలో ఆశను, విశ్వాసాన్ని కలిగించింది. ఎక్కడైతే ప్రజల శ్రమ గుర్తింపబడుతుందో, గౌరవింపబడుతుందో అక్కడ...శ్రమజీవులు, కర్షకులు, సామాన్య ప్రజలు సృష్టించిన సంపద...కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించబడదన్న విషయం నిరూపితమైంది. అక్టోబర్ విప్లవం వలన సోవియట్ యూనియన్‌లో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అనారోగ్యం మొదలైనవి అతి తక్కువ వ్యవధిలో నిర్మూలింపబడ్డాయి. అదే సమయంలో సైన్స్ అభివృద్ధి విషయంలో భారీ ప్రగతిని సాధించింది. అంతేగాక అత్యంత సంపన్నమైన, అత్యంత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశమైన అమెరికాతో పోటీ పడేలా సోవియట్ యూనియన్ ఎదిగింది.

శ్రామిక వర్గానికి, సామాన్య ప్రజలకు...అభ్యుదయ వాదులందరికీ అక్టోబరు విప్లవం స్ఫూర్తినిచ్చింది. నాడు బ్రిటిష్ వలసవాదం నుండి మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న సంస్థలు, శక్తులు సోవియట్ యూనియన్ విజయాల ద్వారా బాగా ప్రభావితమయ్యాయి. సోవియట్ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం చూసి...స్వతంత్ర భారతం గురించిన వారి దక్పథం మరింత ప్రభావితమైంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు దాటింది. మత విభజన సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తున్న ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో పనిచేస్తున్న మోడీ ప్రభుత్వ హయాంలో మనం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాం. అంతేగాక ఎంతో కష్టపడి సాధించుకున్న హక్కుల మీద, ప్రజల ప్రయోజనాలపైన దాడి జరుగుతున్నది. బ్రిటిష్ పాలనను తలపించే పరిస్థితులకు ప్రజలు నెట్టివేయబడుతున్నారు.



కె. హేమలత

అక్టోబర్ విప్లవాన్ని స్మరించుకోవడం, అది సాధించిన ఘన విజయాలను గుర్తుచేసుకోవడం ఒక మొక్కుబడి కార్యక్రమంగా పరిగణించరాదు. మన దేశంతో సహా ప్రపంచంలోని శ్రామిక వర్గానికి ఇదొక సందర్భం కావాలి. ప్రపంచ గతిని మార్చిన సంఘటన నుండి పాఠాలు నేర్చుకుని...పాలక వర్గాలను ఐక్యంగా ఎదుర్కోవడానికి, వారిని ఓడించి దోపిడీ రహిత సమాజాన్ని సాధించడానికి దృఢ సంకల్పం తీసుకోవాలి. అది సాధ్యమేనని అక్టోబర్ విప్లవం రుజువుచేసింది.

సోవియట్ యూనియన్ కుప్పకూలి దాదాపు మూడు దశాబ్దాలు అయింది. ఇది సోషలిజంకు పెద్ద ఎదురుదెబ్బ. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు వ్యవస్థ పతనం ఎంతోమంది సామాజిక స్థితి, జీవన ప్రమాణాల తీవ్ర క్షీణతకు దారితీసింది. ఆ తర్వాత వచ్చిన ఆర్థిక సంక్షోభాలు వలన



పేదరికం పెరిగింది. మరణాలు, ఆత్మహత్యల రేటు పెరిగింది. 2020లో ఓ స్వతంత్ర సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం, 75 శాతం మంది రష్యన్లు "సోవియట్ యుగం అనేది రష్యా చరిత్రలో అత్యుత్తమ కాలం"గా భావించారు. సాధారణ పౌరులకు ఉన్నత స్థాయి శ్రేయస్సు, అవకాశాల పరంగా కూడా ఆ సమయం చాలా అత్యుత్తమమైనదని విశ్వసించారు.

అయితే, సోవియట్ పతనం తర్వాత...పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం యొక్క కిరాయి రాతగాళ్లు...సోషలిజాన్ని ఎదుర్కొనే ఒక సిద్ధాంతంగా నయా ఉదారవాద విధానాన్ని ముందుకు తీసుకొచ్చారు. దీనిని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు డబ్ల్యు.టి.ఓ, ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్లారు. దీనికి ప్రత్యామ్నాయం మరొకటి లేదని ప్రజలు విశ్వసించేట్టు చేశారు.

2007-2008 ఆర్థిక సంక్షోభం తర్వాత...అలాగే అప్పటి నుండి ఒకటిన్నర దశాబ్దాల కాలంలో ఏర్పడిన కోవిడ్ సంక్షోభం తర్వాత...ఈ నయా ఉదారవాద విధానం ఎటువంటి పరిష్కారం చూపలేకపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థను మోసే పెద్దలు కూడా తోక ముడిచారు. నయా ఉదారవాదానికి నాయకత్వం వహించిన ఐ.ఎం.ఎఫ్ కూడా తన వైఫల్యాన్ని అంగీకరించింది. వృద్ధి ఉన్నప్పటికీ ఫలితాలు అనిశ్చితంగా ఉన్నాయని, పెరిగిన ఆర్థిక అస్థిరత, సంక్షోభాల కారణంగా అసమానతలు తీవ్రమయ్యాయని తన ఆన్‌లైన్ మ్యాగజైన్ 'ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్'లో పేర్కొంది.

కోవిడ్ సమయంలో కార్మికులు, ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ప్రజల ప్రాణాలను, జీవనోపాధిని పరిరక్షించడంలో అత్యంత ధనిక, శక్తివంతమైన అమెరికాతో సహా పెట్టుబడిదారీ దేశాలు విఫలం కావడాన్ని వారు స్పష్టంగా గమనించారు. ఈ కోవిడ్ వైరస్‌ను మొదట గుర్తించిన చైనాతో సహా సోషలిస్టు దేశాలు ప్రజల ప్రాణాలను, వారి జీవనోపాధిని సమర్థవంతంగా కాపాడాయి.

అమెరికా విధించిన క్రూర ఆంక్షల కారణంగా ఇబ్బందులు పడుతున్న సోషలిస్టు దేశం క్యూబా... ప్రభుత్వ రంగంలో ఉన్న బలమైన ప్రజారోగ్య వ్యవస్థ ద్వారా కోవిడ్‌ను ఎదుర్కొని ప్రజలను, వారి ఉపాధిని కాపాడుకుంది.

నయా ఉదారవాదం నేడు అప్రతిష్ట పాలైంది. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. అసమానతలు, ఉద్యోగ నష్టాలు, నిరుద్యోగం, వైద్య సదుపాయాల లేమి పెరగడానికి ఈ నయా ఉదారవాద విధానాలు దారితీశాయి. ఈ విధానాల వలన ట్రేడ్ యూనియన్ హక్కులపై దాడులు, పేదరికం పెరుగుదల, ఆకలి, పోషకాహార లోపం తలెత్తాయి. ప్రజలు ముఖ్యంగా యువత నయా ఉదారవాదాన్ని వ్యతిరేకించసాగారు. అంతేగాకుండా పెట్టుబడిదారీ విధానంపై వారికున్న భ్రమలు తొలగిపోయాయి.

18-24 ఏళ్ల మధ్య వయస్కులైన 54 శాతం మంది అమెరికన్లు తమ తమ రాజకీయ విశ్వాసాలు ఏవైనప్పటికీ పెట్టుబడిదారీ విధానంపై ప్రతికూలంగా ఉన్నారన్న 'యాక్సియోస్' సర్వే వివరాలను 'హెరిటేజ్ ఫౌండేషన్ పేర్కొంది. రెండేళ్ల క్రితం పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల 58 శాతం మంది అనుకూలంగా ఉన్నారు. ఇప్పుడు 42 శాతం మంది మాత్రమే అనుకూలమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని చెప్పింది.

నయా ఉదారవాద విధానాల వలన వారి జీవనోపాధి చితికిపోయినప్పటికీ, జీవన ప్రమాణాలు పడిపోయినప్పటికీ వారి చూపు సోషలిజం కోసం చేసే పోరాటాలపై మళ్లడం లేదు. కానీ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ప్రత్యామ్నాయం కోసం పోరాటాలు చేస్తున్నారు. ఈ నయా ఉదారవాద విధానాల వలన ఏర్పడిన ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రాథమిక హక్కులు - సంక్షేమ ప్రయోజనాలపై దాడులు మొదలగు సమస్యలపై నిరంతరం పోరాటాలు జరుపుతున్నారు. ప్రత్యామ్నాయ విధానాలు అవలంబిస్తామని వాగ్దానం చేసిన కొన్ని లాటిన్ అమెరికా దేశాల్లో ప్రగతిశీల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

మన దేశంలోనూ భారీ పోరాటాలు జరిగాయి. రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటం...ఆ మూడు చట్టాలను మోడీ ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా చేయగలిగింది. ఉమ్మడి ట్రేడ్ యూనియన్ వేదిక పిలుపు మేరకు గత రెండేళ్లలో మన దేశంలోని కార్మిక వర్గం మూడు సార్వత్రిక సమ్మెలు చేసింది. 2020లో రెండు సమ్మెలు జరిగాయి. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో ఒకటి, అలాగే 2022 మార్చిలో ఒక సమ్మె జరిగాయి. దాదాపుగా శ్రామికులందరూ ఈ సమ్మెలలో పాల్గొన్నారు. ఈ సమ్మెలన్నీ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ నయా ఉదారవాద విధానాల వల్లనే తమ జీవన పరిస్థితులు దుర్భరమయ్యాయని, ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఉద్యోగ నష్టాలు, ఉపాధి అవకాశాలు లేకపోవడం, పని ప్రదేశాల్లో పరిస్థితులు దిగజారడం, వ్యవసాయ సంక్షోభం వలన రైతుల మరియు కూలీల ఆత్మహత్యలు పెరగటం...వంటివన్నీ జరుగుతున్నాయని మన దేశంలోని కార్మిక వర్గం ఇంకా గుర్తించడం లేదు.

ప్రజలు తమ నిజమైన శత్రువులైన నయా ఉదారవాద విధానాలను, దోపిడీపై ఆధారపడిన పెట్టుబడిదారీ వ్యవస్థను గుర్తించకుండా ఉండేలా కేంద్రంలో మోడీ నేతృత్వంలోని పాలక వర్గాలు సమర్థవంతంగా వ్యవహరిస్తున్నాయి. మన ప్రజలు, కార్మికులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడినప్పుడు బిజెపి రాజకీయ, సైద్ధాంతిక గురువైన ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ వారి కొమ్ము కాసింది. ఇప్పుడు బిజెపి వారు (మన పాలక వర్గాలు) అమెరికా సామ్రాజ్యవాద కొమ్ము కాస్తున్నందున దేశంలో నయా ఉదారవాద విధానాలు మరింత వేగంగా అమలు చేయబడుతున్నాయి.

ఈ శక్తులు మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని ద్వేష భావాన్ని పెంచుతూ సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించాలని చూస్తున్నాయి. స్వతంత్ర పోరాట సమయంలో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన రాజ్యాంగం స్థానంలో ... దళితులను, గిరిజనులను, స్త్రీలను అణగదొక్కాలని చూసిన మనుస్మృతిని తీసుకురావాలని చూస్తున్నాయి. బిజెపి, ఆర్ఎస్ఎస్ లకు స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ సంస్థలు, వ్యాపార సంస్థలు అండగా నిలుస్తున్నాయి. దేశంలోని నిరసన స్వరాలను అణచివేసేందుకు బిజెపి ప్రభుత్వం అన్ని రకాల అస్త్రాలను ఉపయోగిస్తోంది. ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులపై దాడి జరుగుతున్నది. పార్లమెంటరీ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తున్నారు. ప్రజలు ఐక్యతను, ఐక్య పోరాటాలు దెబ్బ తీసే చర్యలు చేపడుతున్నారు.

ఈ నేపథ్యంలో సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు నిర్వహించిన ఉమ్మడి జాతీయ మహాసభ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. దేశ రాజధానిలో 2023 బడ్జెట్ సమావేశాల సందర్భంగా భారీ ప్రదర్శనకు పిలుపునిచ్చింది. దీనికోసం దేశ నలుమూలలా ప్రచారం చేయాలని నిర్ణయించింది. నయా ఉదారవాద విధానాల దుష్ఫలితాలను తిప్పి కొట్టాలని, అదే సమయంలో ప్రజల ముందు ప్రత్యామ్నాయ విధానాలను వుంచాలని ఐక్యవేదిక పిలుపునిచ్చింది.

సామాన్య ప్రజలు, కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు, శ్రామిక వర్గాల ద్వారానే మన సమాజం యొక్క సంపద సృష్టించబడింది. శ్రమ దోపిడీ చేసే పెట్టుబడిదారీ వ్యవస్థ వలన ఇబ్బంది పడుతున్న వీరంతా ఉమ్మడి పోరాటాల ద్వారానే ఈ విధానాలను తిప్పికొట్టి ప్రత్యామ్నాయ విధానాలను తీసుకురాగలరు.


వ్యవస్థాగత సంక్షోభంలో ఉన్న దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థను మార్చాల్సిన అవసరం గురించి మన కార్మిక వర్గానికి, అలాగే కర్షకులకు అవగాహన కల్పించాలి. ఈ కర్తవ్య సాధనకు ఐక్య పోరాటాలను ముందుకు తీసుకువెళ్ళే విధంగా...అక్టోబర్ మహా విప్లవం స్ఫూర్తితో కార్మిక వర్గాన్ని సిద్ధం చేయాలి.

(వ్యాసకర్త సిఐటియు జాతీయ అధ్యక్షురాలు)

బోనులో కమలగణం.. మొత్తం కుటిలం...

ప్రస్తుతం

వారం వారం శీర్షికలో ఒకే విషయం మీద వరుసగా రెండోవారం రాయడం అరుదుగానే జరుగుతుంది. గుజరాత్, హిమాచల్ ఎన్నికలతో సహా అనేక విషయాలను స్పృశించవలసి వుంది కూడా. అయినా ఈ వారం మనం హైదరాబాద్ ఆపరేషన్ ఫాంహౌస్, దానిపై ముఖ్యమంత్రి కెసిఆర్ విడుదల చేసిన ఆందోళనకర సమాచార సముద్రం, బోనులో చిక్కిన బిజెపి కేంద్ర రాష్ట్ర నేతలు కొనసాగిస్తున్న అర్థరహితమైన వాదనలు, దేశంపై వీటి ప్రభావం గురించి తక్కువ చేసి చెబుతున్న కొందరు మేధావుల విచిత్ర అంచనాలు, ఈ విషయాలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చేస్తున్న హెచ్చరికలు, వీటి నేపథ్యంలో తరలి వస్తున్న ప్రధాని మోడీ పర్యటన రాజకీయాలు చెప్పుకోవలసి వస్తున్నది. ఈ మధ్యలోనే మునుగోడు ఉప ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ సంకేతాలూ కనిపిస్తున్నాయి. ఇవన్నీ కలిపి చూస్తే బిజెపిని తక్కువ అంచనా వేసిన వారు గాని ఎక్కువ అంచనా వేసి దాని చుట్టూ పరిభ్రమిస్తున్న వారు గాని నేర్చుకోవలసిన పాఠాలు చాలా వుంటాయి. నేర్చుకోని వాళ్లకు నేర్పడం కోసం స్వయంగా ప్రధాని మోడీ హోంమంత్రి అమిత్ షా దూతలే రావడం ఇక్కడం విశేషం. మరొకిరి భాష్యం, వివరణ లేకుండా బిజెపి బేహారులే చెప్పిపోయినా ఇంకా వారి తరపున వకాల్తా పుచ్చుకునేవారికి వక్రీకరించే వారికి లేదంటే తిప్పి తిప్పి మాట్లాడుతూ కెసిఆర్ దెబ్బతిన్నట్టు చూపించే వారు ఇంకా కనిపిస్తున్నారంటే మన వ్యవస్థలోనూ మీడియాలోనూ వారెంత లోతుగా వేళ్లూనుకున్నదీ తెలుస్తుంది. రాజకీయంగా ఆచరణాత్మకంగా సాంకేతికంగా మూడు కోణాల్లో చూడవలసిన ఈ అంశంపై కేవలం రాజకీయం గుప్పించడం, లేదంటే ఊరికే సాంకేతిక వాదనలతో తికమక చేయడం, అదీ కాదంటే ప్రజలు పట్టించుకోరని కొట్టిపారేయడం ఇలాంటి వారికి పరిపాటి.



తెలకపల్లి రవి

దారి తప్పించే వాదనలు

గతంలో టిఆర్ఎస్‌లో చేరికలను పోటీ పెట్టి చూపడం వీరి మొదటి అస్త్రం. అలాగే ఎనిమిది రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూల్చివేస్తే లేనిది ఇప్పుడు ఏమవుతుందని మరో సవాలు. చివరగా ఇవన్నీ కోర్టులో నిలవబోవని చప్పరించడం. ఏతావాతా వీటన్నిటి పరమార్థం ఒకటే. ఏమీ కాలేదు ఏమీ కాదు! గతవారం ఈ శీర్షిక రాసిన రోజునే మరో పత్రికాధిపతి కెసిఆర్ వెనుకంజ వేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు పిరికివాడు గనక కెసిఆర్‌కు లొంగిపోయాడని, కెసిఆర్ తమపై వచ్చిన లిక్కర్ స్కామ్ ఆరోపణల కారణంగా రాజీకి దీన్ని ఉపయోగించుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పైగా అమిత్ షా వంటి వారికి సంబంధం వుందని నిరూపించడం కుదిరే పని కాదని కూడా తేల్చేశారు. ఇక్కడ జరిగింది రాజకీయంగా ఎవరి పనో ప్రతివారికీ అర్థమైంది. మరొకటి సాంకేతికంగా కోర్టులో ఏదో ఒరిగిపడుతుందని ఎవరూ అనుకోలేదు. కాకపోతే కెసిఆర్ భాగోతం మొత్తం భారతదేశానికి చేరుస్తానని ప్రకటించారు గనక తెలంగాణకో ఎ.పి కో పరిమితం కాబోదని మాత్రం



ఇన్ని ఆధారాలు, తీవ్రమైన కుట్రలు ఒక్కసారిగా దొరికిపోయినా వాటిని కాకుండా కెసిఆర్ ఎత్తుగడల గురించి మాట్లాడేవారిని ఏమంటాం? పైగా దొరికిపోయిన ముగ్గురికి మాకు ఏ సంబంధం లేదని బిజెపి నేతలు బుకాయించడం మరీ హాస్యాస్పదం. ఎందుకంటే వారితో సంబంధం లేకుంటే హైకోర్టులో అందరికన్నా ముందు కేసు వేయాల్సిన అవసరమే లేదు. ఆ పిటిషన్‌లో ప్రతివాదులుగా ప్రభుత్వాన్ని పోలీసులను తప్ప ప్రధాని తరపున వచ్చామని ప్రకటించుకున్న ఈ ముగ్గురు ముఠాను చేర్చిందే లేదు. మరి నేరుగా బిజెపి, ఆరెస్సెస్ తరపున సంచరిస్తున్నామని వారు చెప్పుకుంటే ...మోసగాళ్లని వారిని బోనెక్కించాలి కదా? తమ దగ్గర అనేక ఐడీలు పాన్‌కార్డులు, వుంటాయని స్వయంగా చెప్పుకున్న ఆ టక్కరుల వెనక ఎవరున్నారో తేల్చాలి కదా? వారు మోడీ పేరు చెప్పుకుంటే పిఎంఓ రంగంలోకి రాలేదే?

స్పష్టమైంది. అయితే దాన్ని కూడా తక్కువ చేసి చూపడం ఏం నీతి? ప్రభావం వుండేది లేనిదీ తర్వాత, ముందు ఆ ప్రయత్నాన్ని స్వాగతించాలి కదా! అది కూడా జరక్కపోవడమే విచారకరం. పైతరగతులకు చెందిన వారి పల్టీలు, పిల్లిమొగ్గలు ఎలా వున్నా సామాన్య ప్రజలు, ప్రజాస్వామ్య ప్రియులు ఈ మొత్తం తతంగాన్ని అసహ్యించుకున్నారు గనకే మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లు వెల్లువెత్తారు. దాన్ని గెలిచి నెమ్మదిగా తెలుగునాట పాగా వేస్తామని బీరాలు పలికిన బిజెపి నేతలు ప్రచారానికే మొహం చాటేశారు. అగ్రనేతలు వెనక్కు మళ్లారు. ఎగ్జిట్ పోల్స్ ఏవీ బిజెపికి విజయం గాని భారీ ఓటింగు గాని వస్తుందని చెప్పలేకపోయాయి. పండితులు, పాలకులు ఏమంటున్నా సామాన్య ఓటర్లు సారాంశం సరిగ్గా గ్రహించారు గనకే ఇలా వుందనడం నిస్సందేహం. ఈ విషయంలో మీడియానే గాక ఉన్నత న్యాయస్థానం కూడా ఆశ్చర్యకరంగానే ప్రవర్తించింది. తెలంగాణ హైకోర్టులో ఇద్దరు ఏకసభ్య ధర్మాసన న్యాయమూర్తులు రెండు రకాలుగా ఆదేశాలిచ్చారు. జస్టిస్ విజయసేన్‌రెడ్డి బిజెపి వేసిన పిటిషన్‌ను స్వీకరించి దర్యాప్తును వాయిదా వేయాలని చెప్పగా జస్టిస్ సుమలత మాత్రం పోలీసుల పిటిషన్‌పై నిందితులను పద్నాలుగు రోజులు కస్టడీకి అనుమతించారు. ఇలా ఒకే కోర్టు నుంచి రెండు తీర్పులు రావడమేమిటని సుప్రీంకోర్టుకే సందేహం కలిగిందంటే భిన్న వ్యవస్థల పాత్ర అర్థమవుతుంది. సుప్రీం కోర్టులో ఈ కేసు విచారణ చేపట్టిన జస్టిస్ గవాయి జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఎవరో నిందితులను పట్టుకుంటే ఒక రాజకీయ పార్టీ (బిజెపి) పిటిషన్ వేయడమేమిటి వారికేం సంబంధం? దాన్ని ఎలా అనుమతించారు? అని ఆక్షేపించారు. మరోవైపున వారే సులభంగా బెయిలు ఇవ్వొచ్చు, మా దగ్గరికి వస్తే అప్పుడే ఇచ్చే వాళ్లం, కాకుంటే బిజెపి పిటిషన్ వేయడం వల్లనే కాస్త ఆలోచించవలసి వస్తున్నది అంటూ సోమవారానికి కేసు వాయిదా వేశారు. అంటే హైకోర్టును తప్పు పడుతున్నా సుప్రీంకోర్టు కూడా నిందితులను తక్షణం విడుదల చేయొచ్చనే వైఖరి తీసుకుంది.

ఆణిముత్యాలు..అసలు సత్యాలు..

టీవీ చర్చలలోనూ ఇతరత్రా చాలామంది ఈ ఆధారాలు కోర్టులో నిలబడతాయా అని సందేహాలు గుప్పించారు. కాగా కొందరు మాజీ పోలీసు అధికారులు హైకోర్టుకు ఇచ్చిన ఆధారాలు బయిట ఎలా విడుదల చేస్తారని కెసిఆర్‌పై విమర్శ ఎక్కుపెట్టారు. అంతేగాని కేసు తీవ్ర స్వభావం, పథకం ప్రకారం ఉచ్చులో చిక్కించడం, ఈ సంభాషణలను పత్రాలను బట్టి దేశంలో ఇతర చోట్ల జరిగిన జరుగుతున్న కుట్రలను విశ్లేషించడం ప్రధానమని భావించలేదు. ఎందుకంటే ఆ వీడియోలలో ఆడియోలలో పత్రాలలో వున్న ఆధారాలు మామూలువి కావు. రామచంద్ర భారతి, సింహయాజులు, నందకుమార్‌ల త్రయం దేశమే తమ చేతుల్లో వున్నట్టు మాట్లాడారు. తమకు నేరుగా ఆర్ఎస్ఎస్ కీలకమని మోడీ అయినా వారి అదుపాజ్ఞల్లో పని చేయాల్సిందేనని రాష్ట్రాల అధ్యక్షులు, నాయకులు లెక్కలోనే వుండబోరనీ కుండబద్దలు కొట్టి చెప్పారు. 24 మందితో కూడిన తమ ముఠా దేశమంతా తిరుగుతూ ఇప్పటికి 240 మందికి పైగా ఎంఎల్ఎలను కొనడం ఎనిమిది సర్కార్లను కూల్చడం జరిగిందని చెప్పేశారు. ఇప్పుడు తెలంగాణ, ఢిల్లీ తర్వాత రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ తమ ఆపరేషన్ల జాబితాలో వున్నాయని ప్రకటించారు. కేరళలో రాహుల్ గాంధీపైన పోటీ చేసిన తుషార్ మోహన్, అమిత్ షా, బి.ఎల్ సంతోష్‌ల త్రయం మాత్రమే ఇవన్నీ పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. ఆరెస్సెస్ రాక్‌స్టార్ అని మీడియా అభివర్ణించిన సంతోష్ బిజెపి ప్రభుత్వాధినేతలతోనూ ఎలా పెత్తనం చలాయిస్తారో మీడియా ఎప్పుడో కథలుగా రాసింది. అందులోనూ తుషార్ మాట్లాడిన మాటలు కూడా ఈ వీడియోలలో రికార్డయినాయి. ఇన్ని ఆధారాలు, తీవ్రమైన కుట్రలు ఒక్కసారిగా దొరికిపోయినా వాటిని కాకుండా కెసిఆర్ ఎత్తుగడల గురించి మాట్లాడేవారిని ఏమంటాం? పైగా దొరికిపోయిన ముగ్గురికి మాకు ఏ సంబంధం లేదని బిజెపి నేతలు బుకాయించడం మరీ హాస్యాస్పదం. ఎందుకంటే వారితో సంబంధం లేకుంటే హైకోర్టులో అందరికన్నాముందు కేసు వేయాల్సిన అవసరమే లేదు. ఆ పిటిషన్‌లో ప్రతివాదులుగా ప్రభుత్వాన్ని పోలీసులను తప్ప ప్రధాని తరపున వచ్చామని ప్రకటించుకున్న ఈ ముగ్గురు ముఠాను చేర్చిందే లేదు. మరి నేరుగా బిజెపి, ఆరెస్సెస్‌ల తరపున సంచరిస్తున్నామని వారు చెప్పుకుంటే...మోసగాళ్లుగా వారిని బోనెక్కించాలి కదా? తమ దగ్గర అనేక ఐడీలు పాన్‌కార్డులు, వుంటాయని స్వయంగా చెప్పుకున్న ఆ టక్కరుల వెనక ఎవరున్నారో తేల్చాలి కదా? వారు మోడీ పేరు చెప్పుకుంటే పిఎంఓ రంగంలోకి రాలేదే? వీటిని బట్టి ఈ దళారులు ఎవరి మనుషులో తేలిపోవడం లేదా? బిజెపి కేంద్రం తరపున పరిశీలకుడుగా వచ్చే తరుణ్ చుగ్...కెసిఆర్ కూడా తమ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌లా తడిగుడ్డలతో ప్రమాణం చేయాలని సవాలు చేయడం ఎంత హాస్యాస్పదం? చాలామంది మేధావులు బిజెపి అనుకూల అవకాశవాద వ్యాఖ్యాతలు ఇవన్నీ ప్రశ్నించేబదులు టిఆర్ఎస్‌పైనే అస్త్రాలు, అనుమానాలు సంధించడం దారుణం. ఎక్కడో ఒకచోట దొంగలు పట్టుబడ్డారని సంతోషించే బదులు కోర్టులో నిలబడదు గనక ఇదంతా నిరర్థకమని తీసిపారేయడంలో కుటిలత్వం తొంగిచూస్తుంది.

చరిత్ర చెప్పే సత్యం

ప్రజలు ఇలాంటివి పట్టించుకోరని కొట్టిపారేసేవారు దక్షిణ భారతదేశంలో నాటి కాంగ్రెస్ నేటి బిజెపి ఎలా దెబ్బతినిపోయాయో మర్చిపోతుంటారు. దేశంలో మొదటిసారి కేరళలో నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని కూల్చిన కాంగ్రెస్ వరుసగా పాలన సాగించలేకపోయింది. పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టు ఐక్య సంఘటనలను కూల్చిన కాంగ్రెస్ అక్కడ అసలే అధికారంలోకి రాలేకపోతోంది. తమిళనాడులో డిఎంకె సర్కారును రద్దు చేసిన పాపానికి ఇంతవరకూ జాతీయ పార్టీలు కాలూనలేకపోతున్నాయి. ఎన్టీఆర్‌ను కూల్చిన కాంగ్రెస్ పదేళ్లు మాత్రమే పాలించి ఇప్పుడు అసలే ఎ.పి లో రికానా లేకుండా పోయింది. తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలే బలపడ్డాయి. బొమ్మైని కూల్చిన కర్ణాటకలోనూ కష్టపడి ఫిరాయింపులతో, అక్రమ ధనంతో రాజ్యాన్ని సాగిస్తున్నారు. బీహార్ లోనూ రెండు జాతీయ పార్టీలు తాముగా అధికారంలోకి వచ్చింది లేదు. కాంగ్రెస్ ఏకపక్ష రాజకీయాలు, కూల్చివేతలు ఒక తరహా అయితే బిజెపి మోడీ హయాంలో మరింత బరితెగించింది గనకే ఆపరేషన్ ఫామ్‌హౌస్ వంటి హీనాతిహీన కృత్యాలకు పాల్పడుతున్నది. దీనికి తోడు వ్యవస్థాగతంగానూ రాష్ట్రాల హక్కులను హరిస్తున్నది. ఏకపక్ష పెత్తనానికి ఎగబడుతున్నది. మతతత్వ రాజకీయాలతో సమైక్యతకు చిచ్చుపెడుతున్నది. అదే మతాధిపతులను రాజకీయ కుట్రలకూ శాసనసభ్యుల బేరసారాలకు వినియోగిస్తున్నది. రాజ్యాంగ నిబంధనలు, దర్యాప్తు వ్యవస్థలు, చట్టాలు, ఏవీ ఆపలేని ఈ భయానక ప్రజాస్వామ్య మేధాన్ని ప్రజలే అడ్డుకోవాల్సి వుంటుంది. వారికి లోబడి వున్నంత మాత్రాన వైసీపీ ప్రభుత్వాన్ని టిడిపి, జనసేన వంటి పార్టీలను కూడా ఉపేక్షించరని గత వ్యాసం చివరలో చెప్పుకున్నాం. పట్టుబడిన నిందితులు నేరుగా ఎపి ప్రభుత్వాన్ని కూల్చివేయడం అందుకోసం 88 మంది ఎంఎల్ఎలను సమీకరిస్తామని చెప్పడం ఇందుకు నిదర్శనం. అయినా ఎ.పి ప్రభుత్వం గాని ప్రధాన పాలక పక్షాలు గాని దీనిపై గప్‌చిప్ అంటూ తమలో తాము పోట్లాడుకుంటున్నాయి. తెలంగాణలో అయితే కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ స్వయంగా పర్యటించినా టిఆర్ఎస్‌నూ బిజెపిని సమానంగా తిట్టిపోయారు. మోడీని మోయడమే మంచిదని సలహా ఇచ్చే కొందరు పత్రికాధిపతులు కెసిఆర్ ఎందుకు వెనకంజ వేశారని ముందస్తుగా శాపనార్థాలు పెట్టారు. వీరంతా రేపైనా కళ్లు తెరిస్తే ప్రజాస్వామ్యానికి వారికీ కూడా శ్రేయస్కరం. రాజకీయమంతా రాష్ట్రాలకే పరిమితం చేసి దేశాన్ని మింగేస్తున్న రాహువును చూడకపోవడం ఆత్మహత్యాసదృశం. అలాగే న్యాయవ్యవస్థ, మీడియా కూడా ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన విజ్ఞప్తి కూడా సముచితమైంది. ఆశించదగింది. ★

సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత ఉద్యమం

● ఆరో రోజుకు చేరిన ఎన్ఎఒబి నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి జిల్లా)

నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం హెచ్చరించారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామం వద్దనున్న ఎన్ఎఒబి మెయిన్ గేటు వద్ద నేవల్ బేస్ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన శనివారానికి ఆరో రోజుకు చేరింది. పెద్ద సంఖ్యలో హాజరైన నిర్వాసితులనుద్దేశించి లోకనాథం మాట్లాడుతూ.. ఆరు రోజులుగా నిర్వాసితులు ఆందోళన చేస్తున్నా జిల్లా అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమన్నారు. నేవీ అధికారులతోనూ, నిర్వాసితులతోనూ ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. జెట్టీ నిర్మాణమయ్యేవరకూ సంప్రదాయ మత్స్యకారులను శారద, వరహా నదుల్లోకి వేటకు అనుమతించకపోవడం శోచనీయమన్నారు. ఎన్ఎఒబి కోసం సర్వస్వం త్యాగం చేసిన నేవీ కాలనీ నిర్వాసితులకు కనీస సదుపాయాలు కూడా కల్పించకపోవడం బాధకరమని తెలిపారు. భూములు, ఉపాధి కోల్పోయిన చినకళవలాపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, వాడ రాంబిల్లి గ్రామాలను నేటికీ ప్రభావిత గ్రామాలుగా గుర్తించకపోవడం సరికాదన్నారు. సమస్యలపై తక్షణమే స్పందించకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, ఎస్.అరుణ, నిర్వాసిత గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

చంద్రబాబుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

● పోలీసు స్టేషన్‌లో టిడిపి ఫిర్యాదు



నందిగామ ఎసిపికి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నందిగామ

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కాన్వాయిపై రాయితో దాడి చేసిన వారిని నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం ఎసిపి జి.నాగేశ్వరరెడ్డి, సిఐ సతీష్‌లను కలిసి ఫిర్యాదు చేశారు. చంద్రబాబు రోడ్‌షోకు వచ్చిన జనాన్ని చూసి ఓర్వలేకే వైసిపికి చెందిన వ్యక్తులు రాళ్లతో చంద్రబాబుపై దాడి చేశారని, ఈ ఘటనలో చంద్రబాబు పక్కనే ఉన్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ గాయపడ్డారని తెలిపారు. టిడిపి నిర్వహించే కార్యక్రమాల వద్ద స్థానిక ఎమ్మెల్యే మొండితోక అరుణ్‌కుమార్ అనుచరులు కన్పించారన్నారు. వారికి అక్కడ పనేంటని ప్రశ్నించారు. బ్యానర్లు ఉన్న ప్రాంతంలో చాటునుంచి కవర్లలో రాళ్లు పెట్టుకొని వచ్చారని ఆరోపించారు. రాళ్లతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సానుభూతి కోసమే చంద్రబాబు ఇలాంటి గిమ్మిక్కులు చేస్తున్నారంటూ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట వీరబాబు, కరీముల్లా, మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల చేతిలో సర్పంచ్ భర్త హత్య?

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడలో ఓ మహిళా సర్పంచ్ భర్తను మావోయిస్టులు హత్య చేసినట్టు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మలంగర్ ఏరియా కమిటీ ఈ ఘాతుకానికి పాల్పడినట్టు సమాచారం. స్థానికుల సమాచారం ప్రకారం.. అరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మలంగర్ ఏరియా కమిటీకి చెందిన ఆరుగురు సాయుధ మావోయిస్టులు శుక్రవారం అర్ధరాత్రి రేవాలి గ్రామానికి వచ్చారు. సర్పంచ్ భర్త భీముడు బార్సేను తమతో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. శనివారం ఉదయం గ్రామస్తులకు బార్సే మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. భద్రతా బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించాయి. ఈ ఘటనపై దంతెవాడ ఎస్‌పి సిద్ధార్థ్ తివారీ స్పందించారు. హత్యపై సమాచారం అందిందని తెలిపారు. మావోయిస్టులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారా ? మరెవరి హస్తమైనా ఉందా ? అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారం నెం.VII
Ref.B1/146/2021 ది.01-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్ధిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య.7.38 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా **పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం, దామనపల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయింటు నిమిత్తము భూములు** అవసరమైనవని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున, ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.7.38 సెంట్లను ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం, దామనపల్లి గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

జిల్లా: అల్లూరి సీతారామరాజు జిల్లా | **మండలం: దేవీపట్నం** | **గ్రామము: వెలగపల్లి**

క్రమ సంఖ్య	సర్వే నెం./ స.డి.నెం.	వర్గీకరణం	మొత్తం విస్తీర్ణం ఎ.సెంట్లు	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెంట్లు	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు/ కట్టడములు వగైరా వివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	14	రైతు పుంజ	7.38	7.38	కొండ్ల వీరభద్రా రెడ్డి (తండ్రి) పండా రెడ్డి	13, 15	16	16	3	జీడిమామిడి-100 తాడి-150 మామిడి-5, టేకు-20
మొత్తం:				7.38						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టములోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** IAS, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన : బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

భోగాపురం ఎయిర్‌పోర్టు క్లియరెన్స్‌పై హైకోర్టు తీర్పునిచ్చిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. దీంతో భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి న్యాయపరమైన అన్ని అడ్డుంకులూ తొలగినట్లేనని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన తదుపరి ప్రక్రియలను పూర్తి చేయడంపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించిందని పేర్కొన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లతో కలిసి భోగాపురం ఎయిర్ పోర్టు అంశంలో కోర్టు తీర్పు ఇచ్చిన దృష్ట్యా తదుపరి చేపట్టాల్సిన చర్యలపై శనివారం ఆయన సమీక్షించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ త్వరలోనే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన జరిగే అవకాశం ఉందని తెలిపారు. గిరిజన వర్సిటీ భూసేకరణలో భాగంగా రైతుల నుంచి పూర్తి స్థాయిలో అంగీకార పత్రాలు తీసుకోవలసి ఉందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం, నిర్మాణ సంస్థ జిఎంఆర్‌కు నిర్మాణం పనుల కోసం భూమి అప్పగింత తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. అయితే ప్రధాని నరేంద్రమోడి ఈ నెల 11న విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఎయిర్‌పోర్టు శంకుస్థాపన ఉండదని పేర్కొన్నారు.

87,175 మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి-మైలవరం

ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం సబ్ డివిజన్ పరిధిలో పట్టుబడిన సుమారు రూ.1.70 కోట్ల విలువ చేసే మద్యం బాటిళ్లను స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం డిసిపి మేరి ప్రశాంతి ఆధ్వర్యాన ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు, జి.కొండూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2,119 కేసుల్లో పట్టుబడిన 87,175 మద్యం సీసాలను ధ్వంసం చేశామని తెలిపారు. మద్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారీ చేసినా, అమ్మినా పీడియాక్ట్ అమలు చేస్తామన్నారు. మద్యం కేసుల్లో పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ ఇస్తూ ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. అక్రమ మద్యం అమ్మకాలు జరిపే వారు తమ పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి డైరెక్టర్ సత్తిబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ నారాయణ స్వామి, మైలవరం సబ్ డివిజన్ ఎసిపి కెవివిఎస్ ప్రసాద్, పలువురు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారం నెం.VII
Ref.B1/271/2021 ది.01-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్ధిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య.8.69 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై భూమి ప్రజాహిత కార్యాలకు అనగా **పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయింటు నిమిత్తము** అవసరమైనవని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున, ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.8.69 సెంట్లను ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము స్థలసేకరణ నిమిత్తం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

జిల్లా: అల్లూరి సీతారామరాజు | **మండలం: గంగవరం (ఏజెన్సీ)** | **గ్రామము: జియ్యంపాలెం**

వ.నెం.	సర్వే నెం.	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం ఎ.సెంట్లు	భూసేకరణలో పడిన భూమి విస్తీర్ణం ఎ.సెంట్లు	పేరు & ఆసక్తి ఉన్న వ్యక్తి యొక్క చిరునామా	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, నిర్మాణాలు మొదలైనవి వివరాలు
1	32/1	పుంజ	1.27	1.27	కారం బాబూరావు (తండ్రి) బాపన్న దొర	26	32/2	32/2	31	జామాయిల్ తోట
2	45/2B	పుంజ	9.15	1.82	కారం బాబూరావు (తండ్రి) బాపన్న దొర	46	49	45/2 పార్ట్	45/2 పార్ట్	-లేవు-
3	66/3	పుంజ	5.40	5.40	కారం బాబూరావు (తండ్రి) బాపన్న దొర	65	67	64	66/2	-లేవు-
మొత్తం:				8.49						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టములోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** IAS, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

'అగ్నిపథ్'తో ఆగిన ఎయిర్‌మెన్ పరీక్ష ఫలితాలు

● ఏడాదిగా 6.34 లక్షల మంది ఎదురుచూపు

న్యూఢిల్లీ : గతేడాది జులైలో జరిగిన ఎయిరిండియా ఎయిర్‌ఫోర్స్ (ఐఎఎఫ్) ఎక్స్, వై గ్రూప్ ఎయిర్‌మెన్‌లకు జరిగిన పరీక్షా ఫలితాలు ఇంకా వెల్లడికాలేదు. ఈ పరీక్ష రాసిన 6.34 లక్షల మంది అభ్యర్థులు ఫలితాల కోసం ఇంకా వేచి చూస్తున్నారు. ఈ ఫలితాలు ఏడాది దాటిపోయినా ప్రభుత్వం వెల్లడించకపోవడం గమనార్హం. అగ్నిపథ్ పథకాన్ని ముందుకు తెచ్చినందు వల్లే ఈ పరీక్షా ఫలితాలను నిర్లక్ష్యం చేశారని అభ్యర్థులు వాపోతున్నారు. పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఒకరైన మహమ్మద్ కమల్ అనే అభ్యర్థి సమాచార హక్కు ద్వారా సంబంధిత అధికారులను ప్రశ్నించాడు. పరీక్షా ఫలితాలు ఇప్పటివరకూ వెలువడలేదని, పరీక్ష కోసం అభ్యర్థులు వెచ్చించిన డబ్బును తిరిగి అభ్యర్థులకు చెల్లించలేదని పేర్కొన్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ నివాసి అయిన మొహమ్మద్ కమిల్ సేకరించిన సమాచారం ప్రకారం, ఈ పరీక్షకు 6,34,249 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం కమిల్ అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో లా చదువుతున్నాడు. ఫలితాలపై కమల్ మాట్లాడుతూ.."జనవరి 2021లో ఎయిర్‌మెన్‌ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఇంటర్ పూర్తి చేసుకున్న నేను దరఖాస్తు చేసుకున్నా. పరీక్ష కోసం ఎంతగానో సన్నద్ధమయ్యా. ఆ ఏడాది జులై 12, జులై 18 తేదీల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షా ఫలితాల్ని నెలలోపే ప్రకటించాలి. కానీ ఎందుకనో నిలిపివేశారు. పరిపాలనా కారణాల్ని సాకుగా చూపుతున్నారు. ఇదే పరీక్ష గతంలో ఏడాదికి రెండుసార్లు నిర్వహించేవారు. 2020, 2021 సంవత్సరాల్లో ఒక్కసారే నిర్వహించారు. మోడీ సర్కార్ తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంలో భాగంగానే ఈ పరీక్ష నిర్వహించటం లేదు" అని కమల్ చెప్పారు.

వెబ్‌సైట్ పనిచేయటం లేదు..

ఎయిర్‌మెన్ ఖాళీల కోసం ఏర్పాటుచేసిన వెబ్‌సైట్ పనిచేయటం లేదు. దీనిపై కేంద్రం ఎలాంటి వివరణా ఇవ్వలేదు. 2021లో పరీక్షల నిమిత్తం అభ్యర్థుల దరఖాస్తుల ద్వారా రూ.15,85,62,250 ప్రభుత్వానికి చేరింది. మరి ఈ డబ్బు ఏమైంది? ఆ వెబ్‌సైట్ ఎందుకు పనిచేయడం లేదు? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. పలువురు అభ్యర్థులు ఆర్‌టీఐ దరఖాస్తు ద్వారా సమాచారాన్ని కోరినా..కేంద్రం నుంచి రావటం లేదు. ఎయిర్‌మెన్ ఖాళీలలకు అగ్నిపథ్ పథకం కింద 'అగ్నివీర్వాయు'గా అభ్యర్థుల్ని నమోదు చేయడం జరుగుతుందని వైమానికదళ ప్రధాన కార్యాలయం తెలిపింది. అభ్యర్థుల నమోదు ప్రక్రియకు వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటుచేసింది. మరి..2021లో నిర్వహించిన పరీక్ష ఏమైందన్నది గందరగోళంగా తయారైంది. ఈ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందా? లేదా? అన్నదానిపై కేంద్రం స్పష్టత ఇవ్వటం లేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారం నెం.VII
Ref.B1/268/2021 ది.01-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్ధిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య.2.03 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై భూమి ప్రజాహిత కార్యాలకు అనగా **పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయింటు నిమిత్తము** అవసరమైనవని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున, ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.2.03 సెంట్లను ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము స్థలసేకరణ నిమిత్తం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

జిల్లా: అల్లూరి సీతారామరాజు | **మండలం: గంగవరం (ఏజెన్సీ)** | **గ్రామము: నేలదోనెలపాడు**

వ.నెం.	సర్వే నెం.	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం ఎ.సెంట్లు	భూసేకరణలో పడిన భూమి విస్తీర్ణం ఎ.సెంట్లు	పేరు & ఆసక్తి ఉన్న వ్యక్తి యొక్క చిరునామా	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, నిర్మాణాలు మొదలైనవి వివరాలు
1	10-1 ఎ	రై. పుంజ	2.03	2.03	కంగల పెద బాపన్న దొర (తండ్రి) కన్నపుదొర	స.నెం. 4	స.నెం. 10-1B	స.నెం. 14	స.నెం. 9	జీడిమామిడి-62, కుంకుడు-3, వేప-7, తాడి-38
మొత్తం:				2.03						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టములోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్టు ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గాని చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** IAS, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారం నెం.VII
Ref: B1/43/2022 ది.01-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్ధిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య. 21.93 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము అవసరమైనవని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30 చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 21.93 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము స్థలసేకరణ నిమిత్తం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: అల్లూరి సీతారామరాజు | **మండలం: గంగవరం (ఏజెన్సీ)** | **గ్రామము: దోనెలపల్లి**

వ.నెం.	సర్వే నెం.	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణలో పడిన భూమి విస్తీర్ణం ఎ.సెం.	పేరు & ఆసక్తి ఉన్న వ్యక్తి యొక్క చిరునామా	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు నిర్మాణాలు మొదలైనవి వివరాలు
1	3-2A, 2B	స.పుంజ	2.42	2.42	కోసు వరలక్ష్మి (భర్త) కన్నయ్య దొర	స.నెం. 2	స.నెం. 2-3	స.నెం. 4	స.నెం. 3-2	దుంప తోట
2	3-3A, 3B	స.పుంజ	5.72	5.72	కోసు వరలక్ష్మి (భర్త) కన్నయ్య దొర	స.నెం. 3-1,2	స.నెం. 4	స.నెం. 4	చోడవరం తాలూకా	దుంప తోట
3	34-2	స.పుంజ	5.11	5.11	చిట్టిపల్లి సుభాష్‌చంద్రబోస్ (తండ్రి) పాండు రంగారావు (4.11) చిట్టిపల్లి చిన్నమ్మ (తండ్రి) పాండురంగారావు (1.00)	స.నెం. 37	స.నెం. 33	స.నెం. 38-2	స.నెం. 34	దుంప తోట
4	38-1A	స.పుంజ	3.59	1.79	కుంజం పెదవెంకన్నదొర (తండ్రి) గంగన్నదొర	స.నెం. 34-1	స.నెం. 33	స.నెం. 38	స.నెం. 35	దుంప తోట
5	46-2B	స.పుంజ	8.89	6.89	బలస సునిల్‌కుమార్ (తండ్రి) నరసారావు	రా కొత్తాడు	స.నెం. 44	స.నెం. 48	స.నెం. 46-2పార్ట్	-లేవు-
	మొత్తం:			21.93						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. చట్టంలోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు. బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గానీ చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** IAS, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం
ఫారం నెం.VII
Ref: B1/278/2021 ది.01-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్(1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్ధిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య. 18.28 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము అవసరమైనవని ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30 చట్టంలోని 19(1) విభాగం ననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 18.28 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద ముంపునకు గురగుచు భూమిని కోల్పోయి నిర్వాసితులు అవుతున్న దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతులకు "పరస్పర అవగాహన ఒప్పందం ప్రకారం" భూమిని కేటాయించు నిమిత్తము స్థలసేకరణ నిమిత్తం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: అల్లూరి సీతారామరాజు | **మండలం: గంగవరం (ఏజెన్సీ)** | **గ్రామము: రాజవరం**

వ.నెం.	సర్వే నెం.	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణం ఎ.సెం.	భూసేకరణలో పడిన భూమి విస్తీర్ణం ఎ.సెం.	పేరు & ఆసక్తి ఉన్న వ్యక్తి యొక్క చిరునామా	హద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు నిర్మాణాలు మొదలైనవి వివరాలు
1	20/1	పుంజ	1.34	1.34	పాయం ముసలయ్య దొర	25	20/3	28	21	తాడి-5
2	21/2	పుంజ	0.99	0.99	బలసా రామాయమ్మ (తండ్రి) సుబ్బారావు	21/1	21/3	21/4	22	-లేవు-
3	21/4ఎ1	పుంజ	2.45	2.38	బలసా ప్రకాశరావు బలసా అప్పారావు	25	18, 20	20	21/2,3	-లేవు-
4	21/4డి	పుంజ	2.31	2.31	బలాసా రాంబాబు (తండ్రి) జనార్ధనరావు					
5	25/5 పార్ట్	పుంజ	6.36	1.76	కంగల వెంకటలక్ష్మి (భర్త) అబ్బాయి దొర	24	21/3	25	22	టేకు-14, గుమ్మడి -14, తాడి-10
6	28/3	పుంజ	0.19	0.19	పాయం ముసలయ్య దొర	నెలదోనె లపాడు	72	24/3	24/1	-లేవు-
7	28/4	పుంజ	0.22	0.22	పాయం ముసలయ్య దొర	నెలదోనె లపాడు	25	24/4	24/2	-లేవు-
8	28/5పార్ట్	పుంజ	3.16	1.58	కురసం ధర్మరాజు దొర	కొత్తపల్లి	32, 33	30	28	-లేవు-
9	28/6పార్ట్	పుంజ	0.91	0.81	చవలం బూరమ్మ	కొత్తపల్లి	31	కొత్తపల్లి	29, 32	-లేవు-
10	77/1	పుంజ	1.84	1.84	కంగల వెంకటలక్ష్మి (భర్త) అబ్బాయి దొర	72	77/3, 4	77/2	76	వరి
11	22/1	పుంజ	4.86	4.86	కారం చెల్లన్నదొర	24	22/1	21	22/1	పామాయిల్ తోట
	మొత్తం:			18.28						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధానమ కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును. చట్టంలోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు. బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గాని, తొలగించుట గానీ చేయవలెను.

సం/- **సి.వి.ప్రవీణ్ ఆదిత్య,** IAS, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

దళితులపై దాడులకు వ్యతిరేకంగా....

విశాల ఐక్య వేదిక



సదస్సులో అభివాదం చేస్తున్న నేతలు

- జనవరిలో రాష్ట్ర స్థాయి సదస్సులు
- ఫిబ్రవరి 28న రాష్ట్ర కేంద్రాల్లో ఆందోళనలు
- 'దేశంలో దళితులపై పెరుగుతున్న దాడులు' జాతీయ సదస్సు పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని హిందూత్వ మతోన్మాద, బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య వేదిక నిర్మాణానికి జాతీయ సదస్సు పిలుపునిచ్చింది. దళితులపై దాడులకు వ్యతిరేకంగా జనవరిలో రాష్ట్రస్థాయిలో సదస్సులు నిర్వహించాలని, ఫిబ్రవరి 28న రాష్ట్ర కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. శనివారం నాడిక్కడ హరికిషన్‌సింగ్ సుర్జీత్ భవన్‌లో "దేశంలో పెరుగుతున్న దళితులపై దాడులు" అంశంపై డిఎస్ఎంఎం, ఎఐడిఆర్ఎం, ఎఐఎడబ్ల్యుయు, బికెఎంయు, ఎఐఎఆర్ఎల్ఎ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ సదస్సుకు రామచంద్రడోమ్ (డిఎస్ఎంఎం), బి.వెంకట్ (ఎఐఎడబ్ల్యుయు) అధ్యక్షత వహించారు. దేశంలో వివిధ ఘటనల్లో మరణించిన వారికి నివాళుర్పించారు. సదస్సును రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, సఫాయి కర్మచారి ఆందోళన్ (ఎస్‌కెఎ) జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ ప్రారంభించారు. డిఎస్ఎంఎం నేత సుభాషిణీ అలీ దళితులపై దాడులు తదితర అంశాలకు సంబంధించిన ఐదు పేజీల తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా బెజవాడ విల్సన్ మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ఉపాధిలో దళితులకు అన్యాయం జరుగుతోందని, గౌరవప్రదమైన ఉపాధి దక్కడం లేదని పేర్కొన్నారు. విద్యా సంస్థల్లోనూ తీవ్ర వివక్షకు గురవుతున్నారని చెప్పారు. కొత్త జాతీయ విద్యా విధానం దళితులకు వినాశకరమని, ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్లు కుదించుకుపోతున్నాయని అన్నారు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరుగుదల : సుభాషిణీ అలీ

ఒకపక్క దళితులపై దాడులు పెరుగుతున్నాయని, మరోపక్క మోడీ సర్కార్ అమృత్ వేడుకలు నిర్వహిస్తోందని డిఎస్ఎంఎం ఉపాధ్యక్షురాలు సుభాషిణీ అలీ విమర్శించారు. రాజ్యాంగాన్ని తిరస్కరించిన ఆర్ఎస్ఎస్, రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా తిరస్కరిస్తోందని విమర్శించారు. దేశంలో అన్ని వర్గాలపై దాడి జరుగుతోందన్నారు. దళితులపై నేరాలు 2011లో 33,719 ఉంటే, 2020 నాటికి 50,291 చేరిందని అన్నారు. 2017 - 2018 మధ్య ఎస్‌సిలపై 27.3 శాతం, ఎస్‌టిలపై 20.3 శాతం నేరాలు పెరిగాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో బిజెపి పాలిత (ఏపి మినహా) రాష్ట్రాల్లోనే దళితులపై దాడులు జరిగాయని, యుపిలో 95,751, బీహార్‌లో 63,116, రాజస్థాన్‌లో 58,945, మధ్యప్రదేశ్‌లో 44,469, ఆంధ్రప్రదేశ్‌లో 26,881 దాడులు జరిగాయని తెలిపారు. దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం 1980లో ప్రవేశపెట్టిన ప్రత్యేక కాంపోనెంట్ పథకాన్ని మోడీ ప్రభుత్వం దశలవారీగా రద్దు చేసిందని, ఆ తర్వాత దళిత, ఆదివాసీ, ఇతర వెనుకబడిన తరగతుల్లో పేదరికం పెరిగిందని అన్నారు. కేరళ ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖ మంత్రి కె. రాధాకృష్ణన్, కేరళ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ చిట్టయం గోపకుమార్, మాజీ ఎంపి రాజ్ కుమార్ సైనీ, ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ రతన్ లాల్, మాజీ ఎంపి అలీ అన్వర్, జిఎస్ గోరియా (బికెఎంయు), అభిరాణి (ఎఐఎండిఎఎం), భగవంత్ సుమా (ఎఐఎఆర్ఎల్ఎ) తదితరులు మాట్లాడారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎమ్మెల్యే కె శాంతకుమారి (డిఎస్ఎంఎం), విక్రమ్ సింగ్ (ఎఐఎడబ్ల్యుయు), కెవిపిఎస్ నేతలు ఆంధ్ర మాల్యాద్రి, జి రాంబాబు, జాన్ వెస్లీ, స్కైలాబ్, డిఎస్‌పిఎస్ నేతలు సుబ్బారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

డిమాండ్లు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం బలోపేతం చేయాలి. ప్రైవేటీకరణ ఆపాలి. కాంట్రాక్ట్, తాత్కాలిక కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రైవేట్ రంగంలోని రిజర్వేషన్లు తప్పని అమలు చేయాలి. ఎస్‌సి, ఎస్‌టి కోటా తగ్గించకుండా, దళిత ముస్లిం, క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వాలి. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించి, అమలు చేయాలి. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి. ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని అమలు చేయాలి. భూమి లేని పేదలకు భూ పంపిణీ చేయాలి.

ఆంధ్రప్రదేశ్ అనుభవంతో దేశవ్యాప్తంగా ఉద్యమం : మల్లేపల్లి లక్ష్మయ్య

సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్, సామాజిక వేత్త మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ 1994 నుంచి 2000 వరకు 17 వేల పైబడి దళితులు హత్యకు గురయ్యారని, 45 వేల మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారని చెప్పారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండటం వల్లే దళిత, గిరిజనులపై దాడుల ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ఉన్నాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ కోసం సిపిఎం ప్రారంభించిన ఉద్యమంలో అన్ని శక్తులు కలిసి వచ్చాయని తెలిపారు. ఆ అనుభవంతో అన్ని రాష్ట్రాల్లో దళితులపై దాడులకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఉద్యమాన్ని నిర్మించాలని, అదొక్కటే ఈ బిజెపి మతోన్మాద రాజకీయాలకు ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. అంబేద్కరిజం, మార్క్సిజం మధ్య ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేవని, రెండు సిద్ధాంతాల లక్ష్యం ఒక్కటేనని అన్నారు.



విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

రోహ్‌తక్‌లో వైద్య విద్యార్థులపై జలఫిరంగులతో దాడి

- అర్ధరాత్రి వేళ విరుచుకుపడిన హర్యానా పోలీసులు

రోహతక్ : హర్యానాలోని రోహ్‌తక్‌లో అధిక ఫీజులకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులపై పోలీసులు అర్ధరాత్రి సమయంలో ప్రతాపం చూపించారు. వైద్య విద్యార్థుల నుంచి రూ.36 లక్షల బాండ్ ఫీజును హర్యానా ప్రభుత్వం వసూలు చేస్తుంది. దీనిని వ్యతిరేకిస్తూ నాలుగు రోజులుగా సుమారు 200 మంది పండిట్ భగవత్ దయాళ్‌శర్మ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిజిఐఎంఎస్) విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జల ఫిరంగులు, భారీ ఎత్తున బస్సుల్లో పోలీసులు కళాశాల ప్రాంగణంలో ప్రవేశించారు. ఆందోళన చేస్తున్న సుమారు 200 మంది విద్యార్థులను చుట్టుముట్టారు. జలఫిరంగులతో దాడి చేశారు. యువతులతో సహా విద్యార్థులందర్నీ బలవంతంగా ఈడ్చిపడేసి, బస్సుల్లోకి ఎక్కించి కళాశాల ప్రాంగణం నుంచి బయటకు తరలించారు. దీనిపై రోహతక్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ ఉదయ్ సింగ్ మీనా మాట్లాడుతూ శుక్రవారం రాత్రి విద్యార్థుల ఆందోళన వేదికను ఆడిటోరియానికి మార్చారని చెప్పారు. అక్కడ స్నాతకోత్సవం నిర్వహించాల్సి ఉందని, విద్యార్థులు మొండిగా ఉండటంతో చెదరగొట్టామని చెప్పారు. యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ స్నాతకోత్సవం సందర్భంగా శనివారం పిజిఐఎంఎస్ క్యాంపస్‌ను హర్యానా గవర్నర్, ముఖ్యమంత్రి, హోం మంత్రి సందర్శించారు. ఈ సందర్శనకు కొన్ని గంటల ముందు విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడ్డారు.



సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన సంఘీభావ ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

- సిపిఎం డిమాండ్

కొల్‌కతా : పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టి, అర్హులందరికీ ఉద్యోగాలివ్వాలని సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్ డిమాండ్ చేశారు. పారదర్శకంగా నియామకాలు చేపట్టి, అర్హులందరికీ ఉద్యోగాలివ్వాలని కొల్‌కతా అండర్ వే వద్ద నిరుద్యోగులు చేస్తున్న ఆందోళన 600వ రోజుకు చేరుకుంది. వారికి మద్దతుగా సిపిఎం ఆధ్వర్యాన వేలాదిమందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సలీమ్ మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో కుంభకోణాలకు పాల్పడిన వారందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పాదర్శకంగా నియామకాలు చేపట్టాలని, అర్హులందరికీ ఉద్యోగాలివ్వాలని కోరారు. ఈ ర్యాలీలో లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు తదితరులు మాట్లాడారు.

మహిళా రిజర్వేషన్లపై కేంద్రానికి సుప్రీం నోటీసు

- ఆరు వారాల్లో అఫిడవిట్ దాఖలుకు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశంపై ఆరు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయ స్థానం ఆదేశించింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లు-2008ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జె.కె మహేశ్వరిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పిటిషనర్ ప్రాముఖ్యత కలిగిన సమస్యను లేవనెత్తారని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కాను అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, ఈ అంశం నిర్వహణలో తీవ్రమైన సమస్య తలెత్తిందని అన్నారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ మహిళ రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 1/3 వంతు రిజర్వేషన్లను ప్రవేశపెట్టడానికి రాజ్యాంగ సవరణను ప్రతిపాదించిందని తెలిపారు. తొలి మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి 25 ఏళ్లు అయిందని అన్నారు. ఈ బిల్లు 2010లో రాజ్యసభలో ఆమోదం పొందిందని, ఆ తరువాత లోక్‌సభ రద్దయిందని తెలిపారు. రాజ్యసభ ఆమోదం పొందినప్పటికీ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టలేదన్నారు. బిల్లును ప్రవేశపెట్టకపోవడం ఏకపక్ష చర్య అని, చట్టవిరుద్ధమని, వివక్షకు దారితీస్తోందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఆరు వారాల్లో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని, దానికి పిటిషనర్ రిజాయిండర్ అఫిడవిట్ మూడు వారాల్లో దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణను 2023 మార్చి నాటికి వాయిదా వేసింది.

మహిళా రిజర్వేషన్లపై మోడీ ఎనిమిదేళ్లు వృథా చేశారు : సీతారాం ఏచూరి

"2014లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే, మహిళా రిజర్వేషన్లను చట్టబద్ధం చేయడానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామని మోడీ ప్రకటించారు. ఎనిమిదేళ్లు వృథా అయిపోయాయి. ఇది ఇప్పుడు ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు, 10 కోట్ల ఉద్యోగాలు, వంద కొత్త స్మార్ట్ సిటీలు వంటి 'జుమ్లా' సిరీస్‌లో భాగమైపోయింది" అని పేర్కొన్నారు.

దేశాన్ని న్యాయవ్యవస్థ నడిపించాలా? లేక ఎన్నికైన ప్రభుత్వాలా?

- న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు పెంచబోం
- కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

"దేశాన్ని న్యాయవ్యవస్థ నడిపించాలా? లేక ఎన్నికైన ప్రభుత్వమా?" అని కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు ప్రశ్నించారు. "న్యాయవ్యవస్థ నిబంధనలను రూపొందించడం ప్రారంభిస్తే, రహదారి ఎక్కడ నిర్మించాలో నిర్ణయిస్తుంది. న్యాయవ్యవస్థ సర్వీస్ నియమాల్లోకి వస్తే ఇంక ప్రభుత్వం దేనికి" అని ఆయన అన్నారు. ముంబయిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ కార్యనిర్వాహక వ్యవస్థలోకి ప్రవేశిస్తూ, న్యాయవ్యవస్థ తన సరిహద్దులను అతిక్రమించకూడదని అన్నారు. దేశాన్ని నడిపించే పనిని ఎన్నికైన ప్రతినిధులకే వదిలివేయాలని చెప్పారు. "దేశ ద్రోహ చట్టంలోని నిబంధనలను మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సుప్రీంకోర్టుకు చెప్పాం. అయినప్పటికీ సుప్రీంకోర్టు కొట్టివేసింది. అది కచ్చితంగా మంచిది కాదు. అందరికీ లక్ష్మణ రేఖ ఉంది. దేశ ప్రయోజనాల కోసం లక్ష్మణ రేఖను దాటొద్దు" అని ఆయన అన్నారు.

న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు పెంచం

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును పెంచే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై భారాన్ని పెంచే అర్హత లేని కేసులు సుప్రీం కోర్టు వరకు వెళ్తున్నాయన్నారు. 'ప్రతి బెయిల్ సుప్రీంకోర్టుకు వెళుతోంది. సుప్రీం కోర్టు దేశం బెయిల్ పిటిషన్లను విచారించేలా ఉంది. బెయిల్ పిటిషన్లను దిగువ కోర్టులు పరిష్కరించాలి. పరిమిత కేసులు హైకోర్టుకు రావాలి. సుప్రీంకోర్టును మరచిపోవాలి. మరణశిక్ష, కొన్ని తీవ్రమైన కేసులు తప్ప బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు ఎందుకు పరిష్కరించాలి" అని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వ బిల్లు వచ్చే శీతాకాల సమావేశాల్లో ఆమోదిస్తామని, మధ్యవర్తిత్వంతో పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించవచ్చునని, పరిమిత కేసులే కోర్టుకు రావాలని చెప్పారు. 2015లో జాతీయ న్యాయ కమిషన్ (ఎన్‌జెఎసి) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాన్ని అందించలేదని పేర్కొన్నారు.

రష్యా కేఫ్‌లో అగ్నిప్రమాదం.. 15 మంది మృతి

మాస్కో : రష్యా కోస్ట్రోమా నగరంలోని కేఫ్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. గాయపడిన వారికి వైద్య సహాయం అందించారని కోస్ట్రోమా ప్రాంత గవర్నర్ సెర్గీ సిట్నికోవా తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన భవనం నుంచి 250 మందిని భద్రతా సిబ్బంది సురక్షితంగా తరలించారు. పోలిగాన్ కేఫ్‌లో వివాదం జరగడంతో ఓ వ్యక్తి ఫ్లేర్ గన్ ఉపయోగించడంతో మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

అమెరికా ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల హవా!

- పోటీలో ఐదుగురు భారతీయ-అమెరికన్లు
- ప్రతినిధుల సభకు 8న మిడ్ టర్మ్ ఎన్నికలు

వాషింగ్టన్ : అమెరికా ప్రతినిధుల సభకు ఈనెల 8న మిడ్ టర్మ్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈనేపథ్యంలో ఓటర్లు డెమొక్రాట్ల వైపా, రిపబ్లికన్ల వైపా అన్నది ఆసక్తికరంగా మారింది. మరొక విధంగా ఈ ఎన్నికల్ని..అధ్యక్షుడు జో బైడెన్ పాలనకు రిఫరెండమని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఈ మిడ్ టర్మ్ ఎన్నికల్లో ఐదుగురు భారతీయ- అమెరికన్లు పోటీ పడుతున్నారు. ఇందులో కాంగ్రెస్ సభ్యులైన ప్రమీలా జయపాల్, రాజా కృష్ణమూర్తి, రో ఖన్నా, అమీ బెరాలు తిరిగి ఎంపికవుతారని సర్వేలో పేర్కొన్నాయి. కాంగ్రెస్‌లో స్వల్ప మెజార్టీతో అధ్యక్షుడు జో బైడెన్...వాతావరణ మార్పులు, తుపాకీ నియంత్రణ, మౌలిక వసతుల అభివృద్ధి, బాలల పేదరికం..మొదలైనవాటిపై కీలక చట్టాలు చేయగలిగాడు. ఈ మిడ్ టర్మ్ ఎన్నికల్ని అధ్యక్షుడు జో బైడెన్ సీరియస్‌గా తీసుకున్నారు. శ్వేతసౌధంలో ఆయన అధికారం, పార్టీలో పట్టును ఈ ఎన్నికలు నిర్ణయించబోతున్నాయి. ప్రస్తుతం సెనెట్‌లో డెమొక్రాట్లకు స్వల్ప ఆధిక్యం మాత్రమే ఉంది. వివిధ అంశాలపై కమిటీ విచారణలను ప్రారంభించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది.

ఒకవేళ మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డెమాక్రాట్లు ఓడిపోతే..అధ్యక్షుడిగా జో బైడెన్ పాలనకు అనేక అడ్డంకులు ఏర్పడతాయి. ఆయన అధికారానికి రిపబ్లికన్లు పరిమితులు విధించటం ఖాయం. రాష్ట్రాల చట్ట సభలను, ప్రభుత్వ పాలనను కాంగ్రెస్ నియంత్రిస్తుంది. 2024 అధ్యక్ష ఎన్నికల్ని మిడ్ టర్మ్ ఎన్నికలు ప్రభావితం చేస్తాయనటం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం బైడెన్ హయాంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ అత్యంత దయనీయ స్థితికి చేరుకుంది. నేరాలు, ఘోరాలు మరింత పెరిగాయి. తుపాకీ కాల్పుల ఘటనలు అందర్నీ ఆందోళనకు గురిచేస్తున్నాయి.



మేనిఫెస్టో విడుదల చేస్తున్న కాంగ్రెస్ నేతలు

హిమాచల్‌లో వేడెక్కుతున్న రాజకీయం

- కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల
- రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఓటూ కీలకమన్న మోడీ

షిమ్లా : ఎన్నికల తేదీ దగ్గర పడుతుండటంతో హిమాలయ పర్వత ప్రాంతంలోని హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ నెల 12న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రధాన పోటీ బిజెపి, కాంగ్రెస్ మధ్య ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా శనివారం సిమ్లాలో విడుదల చేశారు. బిజెపి తరుపున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్)ను పునరుద్ధరిస్తామని, ప్రతి ఇంటికి నెలకు 300 యూనిట్ల వరకూ విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని, 18 నుంచి 60 ఏళ్ల వయసున్న ప్రతీ మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. లక్ష ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని, ప్రతీ గ్రామంలో ఓపెన్ మొబైల్ క్లినిక్స్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొంది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.10 కోట్లతో యువత కోసం ఒక స్టార్ట్ ఆఫ్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ కార్యక్రమంలో ప్రియాంకతో పాటు హిమచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ రాజీవ్ శుక్లా, చత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి భూపేశ్ బగేల్, పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ సుఖ్వీందర్‌సింగ్ శుక్లా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రతిభా సింగ్ పాల్గొన్నారు.

వచ్చే 25 ఏళ్ల అభివృద్ధి కోసం ఓటెయ్యండి : మోడీ

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలోని సుందర్‌నగర్‌లో శనివారం ప్రధానమంత్రి మోడీ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ ఎన్నికలు వచ్చే ఐదేళ్లకు మాత్రమే కాదని, వచ్చే 25 ఏళ్ల అభివృద్ధి పయనాన్ని నిర్ణయిస్తాయని మోడీ అన్నారు. ప్రతీ ఓటూ కీలకమేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు.

ఆ రెండింటి స్థాయి ఒకటే

- పౌరులు జనగణమన, వందేమాతరం పట్ల సమాన గౌరవం చూపాలి
- ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : జాతీయ గీతం 'జన గణ మన', జాతీయ గేయం 'వందేమాతరం' ఒకే స్థాయిలో నిలుస్తాయనీ, పౌరులు రెడింటికీ సమాన గౌరవం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. " 'వందేమాతరం' పాడటం లేదా వాయించటం గురించి జాతీయ గీతం వలె శిక్షాస్పద నిబంధనలు లేదా అధికారిక సూచనలు లేనప్పటికీ.. ఈ పాట భారతీయుల భావోద్వేగాలు, మనస్సులో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించింది. పాటకు సంబంధించి హైకోర్టులు, సుప్రీంకోర్టు అన్ని ఆదేశాలలో ఇది అనుసరించబడుతున్నది" అని కేంద్రం చెప్పింది. ఫోన్‌కాల్స్‌లో 'హలో'కి బదులుగా వందేమాతరం చెప్పాలని ప్రజలను కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం ప్రచారాన్ని ప్రారంభించింది. 'వందేమాతరం' పాటకు జాతీయ గీతం వలె గౌరవం, సమానమైన హోదాను కల్పించాలని న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి ప్రతిస్పందనగా దాఖలు చేసిన అఫిడవిట్‌పై కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ సమర్పణ చేసింది. జాతీయగీతం, జాతీయ గేయం రెండూ వాటి స్వంత పవిత్రతను కలిగి ఉన్నాయనీ, సమాన గౌరవానికి అర్హమైనవని నొక్కి చెప్పిన కేంద్రం.. ప్రస్తుత ప్రొసీడింగ్‌ల అంశం ఎప్పటికీ రిట్ పిటిషన్‌కు సంబంధించిన అంశం కాదని పేర్కొన్నది.



రాంచీలో ఆందోళన చేస్తున్న జెఎంఎం, కాంగ్రెస్ కార్యకర్తలు

హేమంత్ సోరెన్‌కు ఇడి సమన్లను నిరసిస్తూ

రాజ్‌భవన్‌సహా జార్ఖండ్ వ్యాప్తంగా ఆందోళనలు

రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసులను జారీ చేయడానికి వ్యతిరేకంగా జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), కాంగ్రెస్ శనివారం భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించాయి. మనీలాండరింగ్ కేసులో ఈ నెల 3న హేమంత్ సోరెన్‌కు ఇడి నోటీసులు జారీచేసింది. శనివారం జెఎంఎం కార్యకర్తలు రాజ్‌భవన్‌కు మార్చ్ నిర్వహించారు. బిజెపి, ఇడికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. రాజ్‌భవన్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఆందోళనలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. రాజధాని రాంచీతో పాటు అన్ని జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాల్లోనూ నిరసన ర్యాలీలు నిర్వహించారు.

మోర్బీ దుర్ఘటనలో సీనియర్ అధికారి సస్పెన్షన్

గాంధీనగర్ : గుజరాత్‌లోని మోర్బీలో తీగల వంతెన కూలి 140 మందికిపైగా మరణించిన ఘటనలో తొలిసారి ఓ ప్రభుత్వ అధికారిపై వేటు పడింది. మోర్బీ మున్సిపాలిటీ ముఖ్య అధికారి సందీప్‌సిన్హ్ జాలాను గుజరాత్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మోర్బీ మున్సిపాలిటీ.. ఒరెవా సంస్థకు 15ఏళ్లపాటు ఈ వంతెన మరమ్మతులు, నిర్వహణ కాంట్రాక్టును ఇచ్చింది. ఈ కేబుల్ వంతెనను పునః ప్రారంభించే ముందు అధికారులకు సమాచారం అందించలేదని సిఒ జాలా చెప్పారు. బ్రిటిష్ కాలం నాటి ఈ వంతెనకు మరమ్మతులు నిర్వహించిన తర్వాత సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోకుండానే తిరిగి తెరిచినట్లు పేర్కొన్నారు. మోర్బీ మున్సిపాలిటీ ముఖ్య అధికారి సందీప్‌సిన్హ్ జాలాను రాష్ట్ర పట్టణాభివద్ధి శాఖ సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ జిటి పాండ్య తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రెసిడెంట్ అదనపు కలెక్టర్‌కు చీఫ్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. గురువారం ఈ ఘటనపై పోలీసులు జాలాను నాలుగు గంటలకుపైగా విచారించారు



చైనా అధ్యక్షులు సి జిన్‌పింగ్, జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్

జిన్‌పింగ్, స్కోల్జ్ భేటీతో జోరందుకోనున్న

చైనా, జర్మనీ సంబంధాలు

బీజింగ్ : చైనా అధ్యక్షులు సి జిన్‌పింగ్, జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ మధ్య జరిగిన తాజా భేటీతో ఇరు దేశాల మధ్య సంబంధాలు ఊపందుకోనున్నాయి. ఈ భేటీతో చైనా-జర్మనీ మధ్య రాజకీయ విశ్వాసం కూడా పెరగనుంది. చైనా పర్యటనకు వచ్చిన ఓలాఫ్ స్కోల్జ్ శుక్రవారం జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లో ఈ సమావేశం జరిగింది. చైనా కమ్యూనిస్టు పార్టీ నేషనల్ కాంగ్రెస్ జరిగిన తరువాత యూరోపియన్ నాయకులు చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఇరువురు నాయకులు ఇరు దేశాల మధ్య సహకారాన్ని విస్తరించుకోవాలని, చర్చలను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఘర్షణలను నివారించాలని, ఎనర్జీ, డిజిటలైజేషన్ వంటి కొత్త రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని, సుస్థిరమైన చైనా-జర్మనీ సంబంధాల కోసం పరస్పర రాజకీయ విశ్వాసాన్ని పెంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. తమ భేటీ ప్రపంచ శాంతి, అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని ఇరువురు నేతలు పేర్కొన్నారు. స్కోల్జ్ మాట్లాడుతూ జర్మనీకి మాత్రమే కాకుండా మొత్తం యూరప్‌కు చైనా ఒక ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి అని పేర్కొన్నారు. చైనాతో సన్నిహిత వాణిజ్యం, ఆర్థిక సహకారానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్-రష్యా సంక్షోభం గురించి కూడా చర్చ జరిగింది. యూరప్‌లో అణు యుద్ధం నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఇరువురు నేతలు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ధరల నియంత్రణలో ముందున్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

- కేరళలో రెండింతలైన ఐటి ఎగుమతులు

తిరువనంతపురం : కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ధరల పెరుగుదలను సమర్థవంతంగా ఎదుర్కొంది. గత రెండేళ్లలో ధరలను నియంత్రించేందుకు రూ.10,000 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసింది. బియ్యం కొనుగోలు, ధాన్యం నిల్వలు, రేషన్ దుకాణాలు, సహకార మార్కెట్లు నిర్వహించడం మొదలైన వాటి కోసం ఈ నిధులు ఖర్చు చేసింది.

రెండింతలైన ఐటి ఎగుమతులు

2016తో పోలిస్తే 2022లో కేరళ ఐటి పార్క్ ఎగుమతులు రెండింతలయ్యాయి. 2016లో రూ.9,753 కోట్లుగా ఉన్న ఈ ఎగుమతులు ఈ ఏడాదిలో ఇప్పటికే రూ.17,536 కోట్లకు చేరుకున్నాయి. ఐటి కంపెనీల సంఖ్య 640 నుంచి 1106కు చేరుకుంది. ఐటి ఉద్యోగుల సంఖ్య 78,068 నుంచి 1,35,288కు చేరుకుంది. ఈ



ఐటి పార్క్

గణాంకాలన్నీ ఐటి సెక్టార్ అభివృద్ధికి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఫలిస్తాయని సిపిఎం తెలిపింది.

భారీగా పెరిగిన పిఎస్‌యుల ఆదాయం, టర్నోవర్

ఈ ఆర్థిక సంవత్సరంలో, కేరళ పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న 25 ప్రభుత్వ రంగ సంస్థలు మొత్తంగా రూ.386.05 కోట్ల నిర్వహణ లాభాలను ఆర్జించాయి. 17.80 శాతం వృద్ధితో రూ.3892.13 కోట్ల టర్నోవర్‌ను సాధించాయి. ఈ రికార్డులు పిఎస్‌యులను రక్షించాలన్న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని వెల్లడిస్తున్నాయని సిపిఎం తెలిపింది.

రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేసేందుకు మతతత్వ శక్తులు దేశంలోని విశ్వవిద్యాలయాల్లో పట్టు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ విమర్శించింది. లౌకిక ప్రజాస్వామ్య విలువలను సమర్థించడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం అనే ఉన్నత విద్యా లక్ష్యాల నుంచి కేరళ ప్రభుత్వం ఎప్పటికీ వైదొలగదని స్పష్టం చేసింది.

ఎస్‌బిఐకి భారీ లాభాలు

- క్యూ2లో రూ.13,265 కోట్లు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అదిరిపోయే ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. బ్యాంక్ మొండి బాకీలు తగ్గగా.. మరోవైపు ఆదాయం భారీగా పెరగడంతో రికార్డ్ లాభాలను సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఏకంగా 74 శాతం వృద్థితో రూ.13,264.62 కోట్ల నికర లాభాలను ప్రకటించింది. ఆ బ్యాంక్ చరిత్రలో ఏ మూడు మాసాల కాలంలోనూ ఈ స్థాయి లాభాలను ఆర్జించలేదు. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.7,626.57 కోట్ల లాభాలను నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.77,689.09 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో 14 శాతం పెరిగి రూ.88,733.86 కోట్లకు చేరింది. క్రితం సెప్టెంబర్ త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 13 శాతం ఎగిసి రూ.35,183 కోట్లకు చేరింది. అడ్వాన్సులు 19.93 శాతం పెరిగి రూ.25.30 లక్షల కోట్ల నుంచి రూ.30.35 లక్షల కోట్లకు చేరాయి. డిపాజిట్లు 9.99 శాతం వృద్ధితో రూ.38.09 లక్షల కోట్ల నుంచి రూ.41.9 లక్షల కోట్లకు పెరిగాయి.

తగ్గిన మొండి బాకీలు..

2022-23 క్యూ2లో ఎస్‌బిఐ స్థూల నిరర్థక ఆస్తులు 3.52 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 4.9 శాతం జిఎన్‌పిఎ నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 1.52 శాతం నుంచి ఏకంగా 0.8 శాతానికి దిగిరావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (ఆరు మాసాల)లో బ్యాంక్ నికర లాభాలు 37 శాతం పెరిగి రూ.19,333 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే కాలంలో రూ.14,131 కోట్ల లాభాలు నమోదు చేసింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 13 శాతం పెరిగి రూ.66,379 కోట్లకు చేరడంతో మెరుగైన ఫలితాలు ప్రకటించింది.

సంతూర్ 'ఆరెంజ్' రీలాంచ్



హైదరాబాద్ : ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీ విప్రో కన్స్యూమర్ కేర్ తన 'సంతూర్ ఆరెంజ్' సబ్బును తిరిగి మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. 'యవ్వనంగా ఆలోచించండి' అనే నినాదంతో సరికొత్తగా తమ యువ వినియోగదారులను కనెక్ట్ కావాలని నిర్ణయించున్నట్లు తెలిపింది. కొత్త ప్యాకేజింగ్, మెరుగుపడ్డ సువాసన, ఉత్తమమైన తేమదనంతో దీన్ని ఆవిష్కరించినట్లు విప్రో కన్స్యూమర్ కేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీరజ్ ఖత్రి తెలిపారు. 100 గ్రాముల సబ్బు ధరను రూ.36గా నిర్ణయించింది.

దివాళా వైపు రాష్ట్రం : యనమల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వృద్ధి రేటు సుమారు 11 శాతం పడిపోయిందని, పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే రాష్ట్రం దివాళా తీసి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా సగటున రూ.రెండు వేల కోట్ల అప్పు చేస్తోందని, రాష్ట్రంలో దోపిడీ వ్యవస్థను వైసిపి సర్కారు పెంచి పోషిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేస్తున్నారని, ఒకవేళ ఎవరైనా పెట్టుబడి పెట్టదానికి వస్తే తమ వాటా ఎంత అని మంత్రులు, అధికారులు అడుగుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ చర్యల వల్ల నిరుద్యోగం పెరగడంతో పాటు ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు. అభివృద్ధిని చేతులుడిగి వదేసి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పడం మోసం కాదా ? అని ప్రశ్నించారు. రాష్ట్రం తీరమంతా కబ్జాలమయమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మద్యం, దొంగ సంపాదనలను సిఎం ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పార్టీ పోలీసులతో సమస్యలు చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సిఐడి పోలీసులతో తమకు సంబంధంలేని కేసుల్లో ఇరికించి అరెస్టులు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట నకిలీ పత్తి విత్తనాల బాధితుల ధర్నా
- జెడిఎ హామీతో విరమణ



సమస్యలు పరిష్కరించాలని డిఎకు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నకిలీ పత్తి విత్తనాలతో నష్టపోయిన తమను ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట బాధిత రైతులు ధర్నా చేశారు. ఏపి రైతు సంఘం ఆధ్వర్యాన శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వేలాది ఎకరాల్లో రూ.లక్షలు పెట్టుబడి పెట్టి నకిలీ పత్తి విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. నాలుగు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో మాత్రమే శాస్త్రవేత్తల బృందం పరిశీలన చేసిందని, అన్ని మండలాల్లో సర్వే చేయాలని కోరారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 70 వేల నష్టపరిహారంగా ఇవ్వాలని, పంటల బీమా వర్తింప చేయాలని, నకిలీ విత్తనాలు విక్రయించి రైతాంగాన్ని మోసం చేసిన విత్తన కంపెనీలపైన కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా యంత్రాంగం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదన్నారు. రైతులను ఆదుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. డిఆర్‌ఒ మల్లికార్జునుడు జోక్యం చేసుకొని, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావుతో కలిసి రైతు సంఘాల నాయకులు, రైతులతో చర్చలు జరిపారు. మూడు రోజుల్లో కమిటీ నివేదికను వెల్లడిస్తామని మోహన్‌రావు హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లాను యూనిట్‌గా తీసుకుని పత్తి పంటకు బీమా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకుంటామన్నారు. నివేదిక ఆధారంగా సంబంధిత కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం, బండి ఆత్మకూరు, నంద్యాల, మిడుతూరు, జూపాడు బంగ్లా మండలాల్లోని రైతులు పాల్గొన్నారు.

పిల్లలకు మాతృభాష నేర్పించాలి

- బంఢ్ల బాపయ్య విద్యాసంస్థల శతాబ్ది ఉత్సవాల్లో మాజీ ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి - వేటపాలెం (బాపట్ల)

పిల్లలకు మాతృభాష నేర్పించాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరారు. మంచి పనులు చేసేవారిని, సొంత లాభం కొంత మానుకొని సేవ చేసేవారిని సమాజం గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. బాపట్లలోని బండ్ల బాపయ్య విద్యాసంస్థల శతాబ్ది ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. వందేళ్ల క్రితమే విద్యాసంస్థను నెలకొల్పడం బండ్ల బాపయ్యశెట్టి ముందుచూపునకు తార్కాణమన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో మన మందరం ముందుకు వెళ్లాలన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రశంసలు అభినందనలు వస్తాయన్నారు. సంపదను పెంచుకొని పంచుకోవాలన్నారు. సంపాదించిన డబ్బును దొంగిలించగలరు కానీ చదువుకున్న విద్యను దొంగిలించలేరని తెలిపారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడారు. ముందుగా బండ్ల బాపయ్య విద్యాసంస్థల శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు.

5 అసెంబ్లీ స్థానాలు, ఎంపి స్థానానికి డిసెంబరు 5న ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ : వివిధ రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు, ఒక ఎంపి స్థానానికి డిసెంబరు 5న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. డిసెంబరు 8న కౌంటింగ్ నిర్వహించి, ఫలితాలను ప్రకటించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి, ఎస్‌పి వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ మృతితో ఖాళీ అయిన మెయిన్‌పురి లోక్‌సభ స్థానానికి, రాంపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగనున్నాయి. అజాంఖాన్‌పై అనర్హత వేటుతో రాంపూర్‌కు ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే ఒడిషాలోని పదంపూర్, రాజస్థాన్‌లోని సర్దార్‌షహర్, బీహార్‌లోని కుర్హని, ఛత్తీస్‌గఢ్‌లోని భానుప్రతాప్‌పూర్ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఎన్నికల నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది.

రోజుకు రూ.33 కోట్ల నష్టాలు

- ఉద్యోగుల కోత తప్పలేదు
- ఎలన్ మస్క్



వాషింగ్టన్ : ట్విట్టర్‌కు రోజుకు 4 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.33 కోట్లు) నష్టం జరుగుతుందని ఆ కంపెనీ సిఇఒ ఎలన్ మస్క్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులను తొలగించాల్సి వస్తుందని ఆయన సమర్థించుకున్నారు. సిబ్బంది తగ్గింపు మినహా మరో అవకాశం కన్పించలేదన్నారు. తొలగించిన ప్రతి ఉద్యోగికి మూడు నెలల వేతన చెల్లింపులు చేస్తున్నామన్నారు. చట్టప్రకారం ఇవ్వాల్సిన దానికన్నా ఇది 50 శాతం ఎక్కువేనన్నారు. ట్విట్టర్ ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ సంస్థలో 7500 వరకు ఉద్యోగులుండగా.. 3700 పైగా మందిని తొలగించినట్లు రిపోర్టులు వస్తున్నాయి.

విషం చిమ్మే ట్విట్టర్ : జో బైడెన్

తప్పుడు సమాచారాన్ని అవాస్తవాలను వ్యాప్తి చేస్తున్న ట్విటర్‌ను కొనుగోలు చేశారంటూ ఎలన్ మస్క్‌పై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విమర్శలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా, అసత్య ప్రచారాలతో ట్విట్టర్ విషాన్ని చిమ్ముతుందన్నారు. ఇలాంటి సంస్థను మస్క్ స్వాధీనం చేసుకోవడం విచారకరమన్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, సిఇఒ, సిఎఫ్‌ఒలను తొలగించారు. ప్రస్తుతం మస్క్ ఒక్కరే కీలకంగా ఉండడంపై బైడెన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది బైడెన్‌కు వ్యతిరేకంగా మస్క్ మాట్లాడిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని నిపుణులు పేర్కొంటున్నారు.

బిఒబి లాభాల్లో 59% వృద్ధి

హైదరాబాద్ : బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 58.7 శాతం వృద్థితో రూ.3,313 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,088 కోట్ల లాభాలు నమోదు చేసింది. అడ్వాన్సుల్లో మెరుగైన పెరుగుదల ఉండటంతో గడిచిన క్యూ2లో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 34.5 శాతం పెరిగి రూ.10,714 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఎన్ఐఐ రూ.7,566 కోట్లుగా నమోదయ్యింది. క్రితం క్యూ2 నాటికి బ్యాంక్ స్థూల ఎన్‌పిఎలు 95 బేసిస్ పాయింట్లు తగ్గి 5.31 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పిఎలు 42 బేసిస్ పాయింట్లు తగ్గి 1.16 శాతానికి పరిమితమయ్యాయి.



చిన్నారి

JEEVANA
జీవన the family



మీకోసం

స్టీలు గ్లాసులు ఒకదాంట్లో ఒకటి ఇరుక్కుపోయి ఇబ్బంది పెట్టినప్పుడు పై గ్లాసులో చల్లటి నీళ్లు పోసి కింది గ్లాసును వేడినీళ్లలో పెట్టాలి. అప్పుడు సులభంగా కింది గ్లాసు ఊడి వస్తుంది.

జీవన సౌరభం

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించాలి అంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.



ఏడాదంతా వర్షాలే!


పిల్లలూ, చిరపుంజిలో ఏడాదంతా వర్షాలు పడుతూనే ఉంటాయి. ఎందుకో తెలుసుకుందామా!

మేఘాలయాలోని తూర్పు ఖాశీ హిల్స్ జిల్లాలో చిరపుంజి ఒక పట్టణం. ఇది భూమి మీద అతి తేమగా ఉండే ప్రదేశంగా పేరుగాంచింది. బంగ్లాదేశ్ ముఖంగా ఉన్న ఖాసీ కొండల దక్షిణ కొనకు చిరపుంజి ఉంది. బంగాళాఖాతం నుంచి వీచే రుతుపవన గాలులు, మేఘాలు బంగ్లాదేశ్‌లోని పర్వతాల గుండా సుమారు 400 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ఆ తరువాత అవి ఖాసీ పర్వతాలను ఢీకొంటాయి. రెండు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఇవి సముద్రమట్టానికి 1370 మీటర్ల ఎత్తులో ఉండడమే దీనికి కారణం. లోతైన లోయలుండటంతో బాగా దిగువకు మేఘాలు (150 నుంచి 300 మీటర్లు) ప్రయాణించి చిరపుంజి మొత్తం పరుచుకుని తరుచూ వర్షాలు పడుతూ ఉంటాయి.

చిరపుంజిలో అత్యధిక శాతం వర్షం కురవడానికి, ఒరోగ్రాఫిక్ లక్షణాలే కారణమని చెప్పవచ్చు. ప్రతి రుతుపవనంలో వచ్చే మేఘాలు కొండలను ఢీకొని, దానికి దిగువన ప్రయాణించే మేఘాలు నునుపైన వక్రతలాల్లోకి నెట్టబడతాయి. దాంతో ప్రతి సీజన్‌లోనూ చిన్న, పెద్ద వర్షాలు పడుతూనే ఉన్నాయి. జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఒక మోస్తారు వర్షం పడుతుంది. మే నుంచి సెప్టెంబర్ వరకూ భారీ వర్షాలు కురుస్తాయి. అక్టోబరులో మధ్య నుంచి డిసెంబరు వరకూ తగ్గుతూ వస్తాయి.

చిరపుంజిలో కురిసే రుతుపవన వర్షాల్లో అత్యధికం ఉదయం పూటే కురుస్తాయి. రెండు రకాల గాలులు ఒకేసారి రావడమే దీనికి కారణం. రుతుపవన కాలంలో బ్రహ్మపుత్రా లోయ నుంచి వీచే గాలులు సాధారణంగా తూర్పు నుంచి ఈశాన్యం వైపుకు వీస్తాయి. కానీ మేఘాలయా నుంచి వీచే గాలులు అంటే దక్షిణవైపు నుంచి గాలులు వీస్తాయి. ఈ రెండు రకాల గాలులు ఖాసీ కొండల సమీపంలో దగ్గరకు వస్తాయి. ఈ కొండల్లో రాత్రి వేళ చిక్కుకున్న గాలులు అవి వేడెక్కిన తరువాత ఉదయం వేళ, పైకి లేవడం ప్రారంభిస్తాయి. దాంతో ఉదయం వేళలో ఎక్కువగా కురుస్తాయి.

నేను గీసిన బొమ్మ





- బి. రోజా, 6వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, హవేలీ, ఘనాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బొమ్మలు గీసి .. బాధ్యత మోసి ...

కొందరు జీవితంలో నిర్దిష్ట మైలురాళ్లకు కట్టుబడి ఉంటారు. ఉదాహరణకు బాగా చదువుకోవడం, ఉద్యోగం చేయడం, వివాహం చేసుకోవడం, కుటుంబాన్ని ప్రారంభించడం మొదలైనవి. మరికొందరు కాలాన్ని బట్టి తమను తాము మార్చుకుంటూ వెళతారు. అటువంటి వారి జీవితం, ప్రతిభ, శక్తిసామర్థ్యాలు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తాయి. వారిలో ఒకరే మంజ్రీ వార్దే. పెయింటింగ్స్, మోడలింగ్, కోడలితో కలసి ఫన్నీ వీడియోలు చేస్తూ విశేష అభిమానులను సంపాదించుకున్న మంజ్రి తాజాగా తన జీవిత చేదు అనుభవాలను వెల్లడించారు.



'ఇప్పుడు నా వయసు 67 ఏళ్లు. నా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. మన జీవితంలో ఏదో ఒక సందర్భంలో నిర్భయంగా అడుగులు ముందుకు వేయాలి. ఆ మార్గం మిమ్మల్ని మీకు నచ్చేలా జీవింపజేస్తుంది. ఆ మార్పు మీ తరువాతి తరానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుంది. మన తరువాతి తరం మనల్ని చూసి ఏదైనా నేర్చుకోవాలంటే ముందు మనం పాతకాలం మూసధోరణిని వదిలివేయాలి' అంటున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్‌లో చాలామంది 'సాసీ సాసు' వీడియోస్ చూడకుండా ఉండరు. కోడలు, నటి సమీరా రెడ్డితో కలసి మంజ్రీ చేసే ఫన్నీ రీల్స్, వంట వీడియోలను అభిమానించని వారు లేరు. సొంతంగా అభిమానులను పోగుచేసుకున్న మంజ్రీ ధరించే ట్రెండీ డ్రెస్సింగ్‌ను ఆమెను ప్రత్యేక వ్యక్తిగా నిలిపాయి. ఫ్యాషన్‌గా, మోడల్‌గా ముఖం మీద ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించే మంజ్రీ జీవితంలో ఎన్నో ఆటుపోటులు.

కాలేజీ చదివే రోజుల్లో ప్రేమించి పెళ్లిచేసుకున్న మంజ్రీ 27 ఏళ్లకే ఇద్దరు బిడ్డల తల్లైంది. సాఫీగా సాగిపోతున్న ఆమె జీవితంలో భర్తతో విభేదాలు విడాకులకు దారితీశాయి. 'భర్త నుంచి విడిపోయిన నేను ఆర్థికంగా బలంగా లేకపోవడంతో పిల్లలను తండ్రి దగ్గరే వదిలిపెట్టాల్సి వచ్చింది. నా కాళ్ల మీద నేను నిలబడిన తరువాత పిల్లలను నా దగ్గరకు తెచ్చేసుకోవాలని ఎంతో తపన పడ్డాను. నాకు వచ్చిన చిత్రకళే నా పెట్టుబడి. అంతకుమించి నా దగ్గర సొమ్ము లేదు. బొమ్మలు వేశాక వాటిని అమ్మేందుకు షాపులకు వెళ్లేదాన్ని. నెలల తరబడి అవి అమ్ముడయ్యేవి కావు. మొట్టమొదటి పెయింటింగ్ అమ్ముడైనప్పుడు నేను పొందిన సంతోషం మాటల్లో చెప్పలేను. నోటి మాట ద్వారా నా గురించి, నా కళ గురించి చాలామందికి తెలిసింది' అంటారు ఈ కళాకారిణి. 'ఒక ఎగ్జిబిషన్‌లో నా కళాఖండాలు చూసిన క్షణం నా జీవితంలో మర్చిపోలేని సంఘటన' అంటూ ఆనాటి రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పటి నుంచి కొన్నేళ్లపాటు కళాఖండాలు చిత్రించడంలోనే ఆమె నిమగ్నమైపోయారు. 'పిల్లలను పోషించుకోగలనన్న నమ్మకం వచ్చాక వారిని నా దగ్గరకు తెచ్చేసుకున్నాను. నన్ను అర్థం చేసుకున్న నా పిల్లలు నాకు ఎంతో మద్దతుగా నిలిచారు' అంటున్నప్పుడు ఆమె చెంపలపై కన్నీళ్లు జాలువారాయి.

'కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్న నేను నా కొడుకు పెళ్లయిన తరువాత నుంచి సెలబ్రిటీగా మారిపోయాను. దీనికంతటికీ నా కోడలు సమీరాయే కారణం. ఆమె వచ్చాక నా జీవితంలో మరో దశ మొదలైంది. ఫన్నీ వీడియోలు చేస్తూ కొత్త కొత్త బ్రాండ్‌ల డ్రస్సులు వేసుకునేదాన్ని. 67 ఏళ్ల వయసులోనూ మోడల్‌గా కనిపించడంలో నాలో దాగున్న కొత్త అభిరుచిని గ్రహించాను. యువత నా డ్రెస్‌ను ఇష్టపడుతూ నాకు పోస్టులు పెడతారు. అప్పుడు భలే సంతోషమేస్తుంది' అంటున్నారు. 30 ఏళ్ల క్రితం నుంచే నా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. అడ్డుగా ఉన్న ప్రతి అడ్డంకినీ దాటుకుని వస్తూ ఎంతో సంతోషంగా జీవించాను' అంటూ నా జుట్టు తెల్లబడింది కాని నా మనసు ఇంకా యవ్వనంలోనే ఉంది' అని చిరునవ్వులు చిందిస్తున్నారు.



ఈ- ఆటో నడుపుతూ ...

పెరిగిన నిత్యావసర ధరల రీత్యా భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తే గానీ ఇల్లు గడవని స్థితిలో చాలా కుటుంబాలున్నాయి. అందులో సీమా కుటుంబం ఒకటి. ఉద్యోగం చేయడానికి సీమా చదువుకోలేదు. కూలి పనులూ అంతంత మాత్రంగా ఉన్నాయి. రోజురోజూకి పెరుగుతున్న ఇంటి ఖర్చులు ఆమెను ఏదో ఒక పనిచేయాలని పురిగొల్పాయి. ఇప్పుడామె భర్త సహకారంతో ఆటో నడుపుతూ కుటుంబ బాధ్యతలను మరింతగా నిర్వహిస్తోంది.

జమ్మూలోని నగ్రోటా ప్రాంతానికి చెందిన సీమాకు ముగ్గురు పిల్లలు. 15 ఏళ్ల కుమారుడు పదో తరగతి చదువుతున్నాడు. 14, 12 ఏళ్ల ఇద్దరు కుమార్తెలూ ఉన్నారు. వీరూ చదువుకుంటున్నారు. భర్త తెచ్చే కొద్దిపాటి కూలి డబ్బులతో వీరిని పోషించడం, చదివించడం కష్టమవుతోంది. భర్తకు సహకారంగా ఉండాలని సీమ చాలా రోజులు కూలి పనులకు వెళ్లింది. కాని అక్కడ ఇచ్చే కూలి సరిపోయేది కాదు. మూడు పూటలా తిండి కష్టమయ్యేది. దాంతో ఆమె బాగా ఆలోచించి ఆటో నడపాలని నిర్ణయించుకుంది. దానికి భర్త మద్దతుగా నిలవడంతో ఈఎంఐ పద్ధతిలో రూ.30 వేలు పెట్టి ఒక ఈ-ఆటో కొనుగోలు చేశారు.

డ్రైవింగ్ నేర్చుకుని ...

40 ఏళ్ల సీమకు సైకిల్ తొక్కడం రాదు. కాని పట్టుదలతో ఆటో నడపడం నేర్చుకుంది. అందుకు భర్త సహకరించాడు. డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పాడు. భర్త ఇచ్చిన ధైర్యంతో నాలుగు నెలల నుంచి నగ్రోటా పరిసర ప్రాంతాల్లో ఆటో నడుపుతుంది. సీమను ఆటో డ్రైవర్‌గా చూసిన కొంతమంది ప్రయాణికులు మొదట ఎక్కేందుకు వెనకాడారు. అయినా ఆమె ఆటో నడపడం ఆపలేదు. ఇప్పుడు నగర పరిసర గ్రామాలకు వెళ్లి జనాన్ని ఎక్కించుకుని సురక్షిత ప్రాంతాలకు చేర్చుతుంది. ఈ క్రమంలో ఆమె ఎన్నో సవాళ్ళ ఎదుర్కొంది. 'నీకు భర్త లేరా? ఎందుకు ఆటో నడుపుతున్నావ్?' అంటూ ప్రయాణికులు ప్రశ్నలు వేసేవారు. ఆమె చిరునవ్వుతో సమాధానం చెప్పేది. తాను సంపాదించిన డబ్బులో రోజూ కొంత దాచిపెడుతూ ప్రతి నెలా రూ.3 వేలు ఈఎంఐ కడుతుంది. ఉదయాన్నే లేచి ఇంట్లో పనులు చేసుకుని, ఆటోను శుభ్రం చేయడం, ఛార్జింగ్ పెట్టడం చేస్తుంది. భర్త పనికి, పిల్లలు స్కూలుకు వెళ్లాక తాను ఆటో తీసుకుని బయలుదేరుతుంది.

నగ్రోట పరిసర ప్రాంతంలో 'ఈ-ఆటో నడుపుతున్న మొట్టమొదటి మహిళగా' సీమ గురించి చెప్పుకుంటున్నారు. 'మహిళలు రైళ్ల, విమానాలు నడుపుతున్నారు... వారిని చూసి నేను ఆటో నడపలేనా? అని ప్రశ్నించుకున్నా. అదే పట్టుదలతో ఆటో నడపడం నేర్చుకున్నా' అంటున్న సీమాదేవి ధైర్యాన్ని, పట్టుదలను అభినందిద్దాం.





3డిలో 'శాకుంతలం'

శకుంతల, దుష్యంతుల ప్రేమ కథ ఆధారంగా దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'శాకుంతలం'. లీడ్‌రోల్ పాత్రలో సమంత నటిస్తోంది. విడుదలకు సిద్ధమవుతున్న చిత్రం ఇప్పుడు 3డిలో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రమోషన్‌కు సిద్ధమైన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం అంటూ ట్విటర్ చేసింది. శకుంతల పాత్రలో సమంత, దుష్యంతుడి పాత్రలో మలయాళ నటుడు దేవ్‌మోహన్ నటిస్తున్నారు. తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో ఈ సినిమా తెరకెక్కించారు. నిర్మాత దిల్‌రాజు సమర్పిస్తుండగా మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.

'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' కొత్త రిలీజ్ డేట్



అల్లరి నరేష్ హీరోగా తెరకెక్కిన 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' సినిమా కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటించారు. ఏఆర్ మోహన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఈ నవంబర్ 11న విడుదల చేస్తామని గతంలో ప్రకటించారు. తాజాగా నవంబరు 25కి మార్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆసక్తికర పోస్టర్‌ని రిలీజ్ చేసి కొత్త థియేట్రికల్ డేట్‌ని ప్రకటించారు. ఈ చిత్రంలో ఆనంది హీరోయిన్‌గా నటించగా జీ 5, హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మాణం వహించారు.

టైటిల్ విజేత ముంబయి

ఫైనల్లో హిమాచల్‌ప్రదేశ్‌పై మూడు వికెట్ల తేడాతో గెలుపు... సయ్యద్ ముస్తాక్ అలీ టి20



కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టైటిల్‌ను ముంబయి జట్టు తొలిసారి కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబయి మూడు వికెట్ల తేడాతో హిమాచల్‌ప్రదేశ్‌ను ఓడించింది. హిమాచల్‌ప్రదేశ్ నిర్దేశించిన 144పరుగుల లక్ష్యాన్ని ముంబయి జట్టు 19.3ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి ఛేదించింది. సర్ఫరాజ్ ఖాన్ చివరి వరకు క్రీజ్‌లో నిలిచి ముంబయి గెలుపులో కీలకపాత్ర పోషించాడు. హిమాచల్ ప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 143పరుగులు చేసింది. ఓపెనర్ ఛోప్రా(19), మిడిలార్డర్ బ్యాటర్ నిఖిల్(22)కి తోడు లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ వశిష్ట్(25), ఏకాంత్ సేన్(37), మయాంక్ దగర్(21) బ్యాటింగ్‌లో రాణించారు. మోహిత్ అవస్థి, తనుష్ కొట్టయిన్‌కు మూడేసి, అమన్, శివమ్ దూబేకు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో ముంబయి ఓపెనర్లు పృథ్వీ షా(11), కెప్టెన్ రహానే(1) నిరాశపరిచినా.. యశస్వి జైస్వాల్(27), శ్రేయస్(34), సర్ఫరాజ్(36నాటౌట్) రాణించారు. వైభవ్ అరోరాకు మూడు, రిషీ ధావన్, మయాంక్ దగర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తనుష్ కొట్టాయిన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు (సంక్షిప్తంగా..)
హిమాహిచల్‌ప్రదేశ్ :143పరుగులు
(20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి)
ఇకాంత్ 37, ఆకాశ్ 25, నిఖిల్ 22,
మోహిత్ అవస్థి 3/20, తనుశ్ కొట్టయిన్ 3/15
ముంబయి : 146పరుగులు.
(19.3ఓవర్లలో 7వికెట్ల నష్టానికి)
సర్ఫరాజ్ ఖాన్ (36నాటౌట్), శ్రేయస్ 34,
యశస్వి జైస్వాల్ 27,
వైభవ్ అరోరా 3/27, రిషీ ధావన్ 2/26
మయాంక్ దాగర్ 2/24
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తనుశ్ కొట్టయిన్

రెండు బెర్తులు.. రేసులో నాలుగుజట్లు

ఒకేరోజు మూడు మ్యాచ్‌లు
నేటితో తేలిపోనున్న గ్రూప్-2 సెమీస్ భవితవ్యం



ఆడిలైడ్: టి20 ప్రపంచకప్ సూపర్-12లో భాగంగా గ్రూప్-1 నుంచి సెమీస్‌కు న్యూజిలాండ్, ఇంగ్లండ్‌జట్లు చేరుకోగా.. ఆదివారం ఒకేరోజు ఏకంగా మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మూడు మ్యాచ్‌లు కూడా గ్రూప్-2కు చెందినవే కావడం విశేషం. తొలిమ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టుతో దక్షిణాఫ్రికా తలపడనుండగా.. ఆ తర్వాత బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ జట్టు తన చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. మూడో మ్యాచ్‌లో జింబాబ్వేతో టీమిండియా తలపడనుంది. జింబాబ్వేపై గెలిస్తే భారత్ టాప్‌లో నిలిచి నేరుగా సెమీఫైనల్ చేరనుంది. ఇక దక్షిణాఫ్రికా గెలిస్తే... 7పాయింట్లతో రెండోస్థానానికే పరిమితం కానుంది. దక్షిణాఫ్రికా ఓడి పాక్ గెలిస్తే సమీకరణలు మారనున్నాయి. పాక్ గెలిస్తే ఆ జట్టు 6పాయింట్లతో రెండోస్థానంలో నిలవనుంది. పాకిస్తాన్ ఓడితే ఇంటి బాట పట్టక తప్పదు. అలా కాకుండా రేపటి మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికా, పాక్ విజయాలు నమోదు చేసుకొని, జింబాబ్వే చేతిలో భారత్ ఓడితే పాక్, దక్షిణాఫ్రికా సెమీస్‌కు చేరనున్నాయి. రన్ రేటులో భారత్ కంటే మెరుగైన గణాంకాలు ఉన్న పాక్ ముందుకు వెళ్లనుంది.

సెమీస్‌కు ఇంగ్లండ్

శ్రీలంకపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు


సిడ్నీ: గ్రూప్-1నుంచి సెమీస్ బెర్తులు ఖరారయ్యాయి. ఈ గ్రూప్‌నుంచి న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు సెమీస్‌కు చేరగా.. ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఈ మూడు జట్ల ఖాతాలో 7పాయింట్లు చొప్పున ఉన్నా.. మెరుగైన రన్‌రేట్‌తో న్యూజిలాండ్(+2.11) టాప్‌లో నిలువగా.. శ్రీలంకపై గెలిచి ఇంగ్లండ్(+0.47) రెండోస్థానానికి ఎగబాకింది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా(-0.17) రన్‌రేట్‌తో మూడోస్థానానికే పరిమితమైంది. శనివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌జట్టు నాలుగు వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను ఓపెనర్ పథుమ్ నిస్సంక(67నాటౌట్ 2ఫోర్లు, 5సిక్సర్లు) అర్ధసెంచరీతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. మార్క్ వుడ్‌కు మూడు, స్టోక్స్, వోక్స్, సామ్ కర్రన్, ఆదిల్ రషీద్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం ఇంగ్లండ్ ఓపెనర్లు జోస్ బట్లర్ (28నాటౌట్; 2ఫోర్లు, సిక్సర్), అలెక్స్ హేల్స్(47నాటౌట్; 7ఫోర్లు, సిక్సర్) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. చివర్లో బెన్ స్టోక్స్(42నాటౌట్; 2ఫోర్లు) బాధ్యతాయుతంగా ఆడి ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆదిల్ రషీద్‌కు లభించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు..

దక్షిణాఫ్రికా × నెదర్లాండ్స్ (ఉ.5.30గంIIలకు)
పాకిస్తాన్ × బంగ్లాదేశ్ (ఉ.9.30గంIIలకు)
(గ్రూప్-2; వేదిక: ఆడిలైడ్ ఓవల్ స్టేడియం)
భారత్ × జింబాబ్వే (మ.1.30గంIIలకు)
(గ్రూప్-2; వేదిక: మెల్‌బోర్న్ క్రికెట్‌గ్రౌండ్)

పాయింట్ల పట్టిక

దేశం	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గ్రూప్-1						
న్యూజిలాండ్	5	3	1	1	7	+2.11
ఇంగ్లండ్	5	3	1	1	7	+0.47
ఆస్ట్రేలియా	5	3	1	1	7	-0.17
శ్రీలంక	5	2	3	0	4	-0.42
ఐర్లాండ్	5	1	3	1	3	-1.61
ఆఫ్ఘనిస్తాన్	5	0	3	2	2	-0.57
గ్రూప్-2						
భారత్	4	3	1	0	6	+0.73
దక్షిణాఫ్రికా	4	2	1	1	5	+1.44
పాకిస్తాన్	4	2	2	0	4	+1.11
బంగ్లాదేశ్	4	2	2	0	4	-1.27
జింబాబ్వే	4	1	2	1	3	-0.31
నెదర్లాండ్స్	4	1	3	0	2	-1.23



రజినీ 'లాల్ సలామ్'

రజినీ కూతురు ఐశ్వర్య దర్శకత్వంలో రజినీకాంత్ నటించబోయే ఈ చిత్రానికి 'లాల్ సలామ్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ని ఖరారు చేసారు. ఈ చిత్రంలో రజినీది ఫుల్ లెన్త్ పాత్ర కాదు. ప్రత్యేక అతిథి పాత్రలో ఆయన కనిపించనున్నారు. గెస్ట్ రోల్ అయినప్పటికీ అది కథలో చాలా కీలమైన పాత్ర అని సమాచారం. తమిళ్ హీరోలు విష్ణు విశాల్, విక్రాంత్ ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శనివారం చెన్నైలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ టైటిల్ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చ నున్నారు. సుభాస్కరన్ సమర్పణలో లైకా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఈ సినిమా రూపొందనుంది. 2023లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

విశ్వక్‌సేన్‌పై ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు



యువ హీరో విశ్వక్‌సేన్ మరోసారి చిక్కుల్లో పడ్డాడు. ఈయన హీరోగా అర్జున్ సర్జా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ ఈ చిత్రం పూజా కార్యక్రమాలను జరుపుకుంది. ఇటీవలే ఈ చిత్రం రెండు షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం చిత్రబృందం మూడో షెడ్యూల్‌కు సిద్ధమౌతుంది. ఈ క్రమంలో విశ్వక్ సేన్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నట్లు ప్రచారం. దీనిపై సీరియస్ అయిన అర్జున్, విశ్వక్ పై ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ చిత్రాన్ని అర్జున్ స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నాడు. ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా నటిస్తుంది.

షూటింగులకు ప్రోత్సాహం

తమ రాష్ట్రంలో కనీసం యాభై శాతం షూటింగ్ (ఇండోర్/ ఔట్ డోర్) జరుపుకునే చిత్రాలకు వివిధ రుసుముల్లో తగ్గింపునిచ్చి, ప్రోత్సాహకాలు అందిస్తామని తాజాగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు మధ్యప్రదేశ్ టూరిజం బోర్డ్ (ఎంపిటిబి) ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆ రాష్ట్ర టూరిజం బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఉమాకాంత్ చౌదరి హైదరాబాద్‌లో ఈ విషయాలు స్వయంగా వెల్లడించారు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68